epaper.tcnewsdaily.com
www.tcnewsdaily.com

తెలంగాణ చౌరస్తా
వాయిస్ ఆఫ్ డెమోక్రసీ

సంపుటి: 01
సంచిక:05

24 క్యారెట్లు 99,215.00 | కిలో వెండి 1,05,657.00 | 29.07.2025, మంగళవారం, హైదరాబాద్

# స్థానికం ఆలస్యం

## బీసీ రిజర్వేషన్లకై ఢిల్లీలో ధర్నా




- అది క్లారిటీ వచ్చాకే స్థానిక ఎన్నికలు
- ఆగస్టు 5న సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీలో ధర్నా
- సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన కేబినెట్‌లో విస్తృతంగా చర్చ
- బీసీ నేతలు సహకరించాలని మంత్రి పొన్నం విజ్ఞప్తి
- ఎన్నికలు ఆలస్యమైతే నిధుల విడుదలలో జాప్యం
- తదుపరి కార్యాచరణపై మంత్రివర్గం సుదీర్ఘంగా చర్చ
- మంత్రి పోన్నం ప్రభాకర్

“ తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలు బీసీ రిజర్వేషన్లు కొలిక్కి వచ్చే వరకు వాయిదా పడే అవకాశం ఉంది. బీసీ రిజర్వేషన్లపై కేంద్రం వైఖరిని నిరసిస్తూ ఆగస్టు 5న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీలో ధర్నా చేయనున్నారు. రాష్ట్రపతి, ప్రధానితో పాటు ఇండియా కూటమి మద్దతు కోరనున్నారు. బీసీ రిజర్వేషన్ల కోసం అన్ని పార్టీల బీసీ నాయకులు సహకరించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు. ఎన్నికలు ఆలస్యమైతే నిధుల విడుదలలో ఇబ్బందులు వస్తాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

**తెలంగాణ చౌరస్తా, స్టేట్ బ్యూరో:** తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై తీవ్ర సందిగ్ధత నెలకొంది. తాజాగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర సచివాలయంలో జరిగిన కేబినెట్ సమావేశంలో ఈ విషయంపై కీలక నిర్ణయం తీసుకున్నారు. బీసీ రిజర్వేషన్ల అంశం కొలిక్కి వచ్చిన తర్వాతనే స్థానిక ఎన్నికలకు వెళ్లాలని మంత్రివర్గం నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఇది ప్రస్తుత రాజకీయ పరిస్థితులలో ఒక ప్రముఖమైన పరిణామంగా కనిపిస్తోంది.

**కేంద్ర వైఖరిపై ఢిల్లీలో భారీ ధర్నా..**

బీసీ రిజర్వేషన్ల విషయంలో కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఢిల్లీలో భారీ ధర్నా చేయాలని తెలంగాణ ప్రభుత్వం సంకల్పించింది. ఈ నేపథ్యంలో.. ఆగస్టు 5వ తేదీన మంత్రులతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీకి పయనం కానున్నారు. అక్కడ వారు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోడీ, పలువురు కేంద్ర మంత్రులను కలవనున్నారు. అంతేకాకుండా.. బీసీ రిజర్వేషన్ల విషయంలో ఇండియా కూటమిలోని ఇతర పార్టీల మద్దతును కూడా కోరనున్నారు. ఈ అంశంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశంలో విస్తృతంగా చర్చ జరిగింది. రాష్ట్ర అసెంబ్లీలో ఇప్పటికే ఆమోదించి కేంద్రానికి పంపిన బీసీ బిల్లు ప్రస్తుతం కేంద్రం వద్ద

2లో



# ఆపరేషన్ సిందూర్ విజయవంతమైంది

- పాక్ ని కాళ్లబేరానికి వచ్చేట్లు చేశాం
- దాడులను సమర్థంగా తిప్పికొట్టాం
- రాజకీయ, సైనిక లక్ష్యాలు నెరవేరాయి
- దేశ భద్రతలో చిన్నచిన్న అంశాలకు ప్రాధాన్యత ఉండదు
- సైనికుల సత్తాను ప్రశ్నించడం తగదు
- పార్లమెంట్‌లో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్

**తెలంగాణ చౌరస్తా,నేషనల్ బ్యూరో:** పహల్గాం దాడిలో ప్రియమైన వారిని కోల్పోయిన బాధిత కుటుంబాలకు న్యాయం చేసేందుకే ఆపరేషన్ సిందూర్‌ను ప్రారంభించినట్లు రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రకటించారు. పాక్ పీచమణిచి కాళ్లబేరానికి వచ్చేట్లు చేశామని లోక్‌సభలో జరిగిన చర్చలో తేల్చిచెప్పారు. ఆపరేషన్ సిందూర్ ద్వారా రాజకీయ, సైనిక లక్ష్యాలు నెరవేరాయని వివరించారు. యుద్ధం ప్రారంభించడం తమ

2లో

# ఫోన్ అలర్ట్ మెసేజ్ రావడంతో ఫిర్యాదు చేశా



- ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రవీణ్ కుమార్ యూటర్న్
- గతంలో బీఆర్ఎస్ ఫోన్ ట్యాపింగ్ చేస్తోందని పిర్యాదు
- ఆయన ఫిర్యాదుపై పంజాగుట్టలో ఎఫ్ఐఆర్
- ఎఫ్ఐఆర్‌పై ప్రవీణ్ కుమార్ నుంచి సిట్ వాంగ్మూలం
- సీఎం రేవంత్‌రెడ్డి తన ఫోన్ ట్యాపింగ్ చేయిస్తున్నట్లు సిట్‌కి కొత్త ఫిర్యాదు
- సిట్‌ను కాంగ్రెస్ పావుగా వాడుకుంటోంది

2లో

## ఇగ వాట్సాప్‌లో ఫిర్యాదు చేయొచ్చు

- ప్రజల కోసం వినూత్న సేవలు,
- హైదరాబాద్ కలెక్టర్ హరిచందన

2లో

## స్పష్టి కేసులో వెలుగులోకి సంచలన విషయాలు

- పోలీసుల దర్యాప్తులో షాకింగ్ విషయాలు
- ఈ కేంద్రంలో టెస్ట్ ట్యూబ్ బేబీ (ఐవీఎఫ్) పద్ధతి జరగలేదు
- వేరొకరికి పుట్టిన బిడ్డలను తీసుకొచ్చి, అద్దె గర్భం ద్వారా పుట్టారని మోసం
- డాక్టర్ నమ్రత దంపతుల నుంచి రూ.40 లక్షల వరకు వసూలు
- బిడ్డల అక్రమ రవాణా చైల్డ్ ట్రాఫికింగ్

4లో



## దద్దరిల్లిన పార్లమెంట్ ప్రాంగణం

- సర్‌పై కొనసాగుతున్న నిరసనల వెల్లువ
- ప్రజాస్వామ్య హననం అంటూ ప్లకార్డులతో ప్రదర్శన
- పార్లమెంట్ మకరద్వారం వద్ద గుమిగూడిన ప్రతిపక్ష ఎంపీలు

2లో

# మీనాక్షి నటరాజన్ పాదయాత్ర

- స్థానిక సంస్థల ఎన్నికల వేళ నటరాజన్ కీలకనిర్ణయం
- పార్టీ నాయకత్వాన్ని బలోపేతం దిశగా ప్రణాళికలు
- ఆరు నియోజకవర్గాల్లో ఏడు రోజుల పాటు
- ప్రతి ఉమ్మడి జిల్లాలోని ఒక నియోజకవర్గంలో యాత్ర
- జూలై 29న పీసీసీ చీఫ్‌తో సమావేశం.. జూలై 31 నుంచి ఆగస్టు 6 వరకు
- ప్రభుత్వ పథకాల అమలు పరిశీలననే లక్ష్యం..రూట్ మ్యాప్ కూడా సిద్ధం
- గత సార్వత్రిక ఎన్నికల ముందు రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర

**తెలంగాణ చౌరస్తా, స్టేట్ బ్యూరో:** తెలంగాణలో అధికార కాంగ్రెస్ పార్టీ మరోసారి ప్రజల్లోకి వెళ్లేందుకు సిద్ధమైంది. ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ ఆరు నియోజకవర్గాల్లో పాదయాత్ర చేయనున్నారు. ప్రజల సమస్యలు

4లో



# కాల్పుల విరమణలో అమెరికా పాత్ర లేదు

- మోదీ, ట్రంప్ మధ్య ఎలాంటి ఫోన్ సంభాషణలు జరగలేదు
- అమెరికా మధ్యవర్తిత్వంపై వస్తున్నవన్నీ ఊహాగానాలే
- పాకిస్థాన్ నిజస్వరూపం వెల్లడించడంలో సక్సెస్
- ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా సహించేది లేదు
- జాతీయ భద్రతపై భారత్ దృఢ వైఖరి
- పాకిస్థాన్ జాతీయులకు వీసా ఆంక్షలు కొనసాగుతాయి
- కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్



**తెలంగాణ చౌరస్తా, నేషనల్ బ్యూరో :** భారత్‌పాకిస్థాన్ మధ్య ఇటీవల జరిగిన కాల్పుల విరమణలో అమెరికా ప్రమేయం ఎంతమాత్రం లేదని కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ తెలిపారు. ఆపరేషన్ సిందూర్ పై లోక్‌సభలో సోమవారం ప్రత్యేక చర్చలో జైశంకర్ మాట్లాడారు. కాల్పుల విరమణకు సంబంధించి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మధ్య ఎలాంటి ఫోన్ సంభాషణలు జరగలేదని ఈ సందర్భంగా కేంద్రమంత్రి తేల్చి చెప్పారు. అమెరికా మధ్యవర్తిత్వంపై వస్తున్న

2లో



# ఇందిరమ్మ రాజ్యంలో ఇంటింటికీ మద్యం

- కేసీఆర్ పాలనలో ప్రతి చేనుకూ నీళ్లు..
- రేవంత్ సర్కార్‌లో ప్రతీ పల్లెకూ మద్యం
- గతంలో హస్తం పార్టీ మద్యం అమ్మకాలపై విమర్శలు
- రేవంత్ హయాంలో పాలన గాలికి ప్రగతి కాటికి
- తాగుబోతుల రాష్ట్రంగా మార్చే కుట్ర
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

2లో

# స్థానికం ఆలస్యం

**తరువాయి భాగం**

పెండింగ్‌లో ఉంది. మరోవైపు, రిజర్వేషన్ల ఖరారుపై హైకోర్టు ఇచ్చిన గడువు కూడా పూర్తైంది. ఈ నేపథ్యంలో.. తదుపరి కార్యాచరణ ఎలా ఉండాలనే దానిపై మంత్రివర్గం సుదీర్ఘంగా చర్చించి ఈ కీలక నిర్ణయం తీసుకుంది. రాజకీయ పార్టీలకు మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపు.. కేబినెట్ సమావేశం ముగిసిన అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ మీడియాతో మాట్లాడారు. బీజేపీ, బీఆర్ఎస్ సహా రాష్ట్రంలోని అన్ని పార్టీలలోని బీసీ నాయకులు అందరూ బీసీ రిజర్వేషన్ల కోసం ముందుకు వచ్చి సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు. ఇదే అంశంపై ఆగస్టు 5, 6, 7వ తేదీలలో ఢిల్లీలో నిరసన తెలుపుతామని, తమతో కలిసి రావాలని అన్ని పార్టీల బీసీ నాయకులను ఆహ్వానించారు. న్యాయపరమైన చిక్కులు తలెత్తకుండా రాష్ట్రంలో కుల గణన చేపట్టామని మంత్రి స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలు ఆలస్యమైతే, వాటికి అందాల్సిన నిధుల విడుదలలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ హైకోర్టు స్థానిక సంస్థల ఎన్నికలను సెప్టెంబర్ 2025 చివరి నాటి నిర్వహించాలని, రిజర్వేషన్ ను ఈ నెలాఖరు నాటికి ఖరారు చేయాలని ఆదేశించింది. అయితే, బీసీ రిజర్వేషన్ బిల్లులు పెండింగ్‌లో ఉండటం వల్ల, రిజర్వేషన్ల అంశం కొలిక్కి వచ్చిన తర్వాతనే ఎన్నికలకు వెళ్లాలని కేబినెట్ నిర్ణయించింది. రిజర్వేషన్ ఖరారుపై హైకోర్టు గడువు సమీపించిన సమయంలో ఈ బిల్లులకు చట్టబద్ధత కల్పించడానికి ఢిల్లీలో ఒత్తిడి తెచ్చేందుకు ఈ ధర్నా నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. బిల్లు చాలా కాలంగా కేంద్రం వద్ద పెండింగ్ లో ఉన్నా.. ఎందుకు ఆమోదింపచేయలేదని మంత్రి పొన్నం ప్రభాకర్ బీజేపీ నేతల్ని ప్రశ్నించారు. ధర్నాలు చేయడానికి తమతో కలిసి రావాలన్నారు. ధర్నాల కోసం మిత్రపక్షాలన్నింటితో కలిసి వెళ్తామన్నారు. బీజేపీ నేతలు.. బీసీ రిజర్వేషన్లతో రాజకీయాలు చేయవద్దన్నారు.

# ఇందిరమ్మ రాజ్యంలో ఇంటింటికీ మద్యం



**తెలంగాణ చౌరస్తా, స్టేట్ బ్యూరో:**

కేసీఆర్ పాలనలో ప్రతి చేనుకూ నీళ్లు అందిస్తే.. రేవంత్ సర్కార్‌లో ప్రతీ పల్లెకూ మద్యాన్ని అందిస్తున్నారంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. ఇందిరమ్మ రాజ్యంలో ఇంటింటికీ మద్యం అంటూ ఎక్స్ వేదికగా కాంగ్రెస్ ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. గతంలో మద్యం అమ్మకాలపై విమర్శలు చేసిన హస్తం పార్టీ.. ఇప్పుడు అదే మద్యం ద్వారా వచ్చిన ఆదాయం గడిస్తుందని ఎద్దేవా చేశారు. తెలంగాణను తాగుబోతుల తెలంగాణగా మారుస్తూ.. మద్యం ప్రియుల బలహీనతను రాష్ట్ర ఖజానా ఆదాయ వనరుగా మార్చుకునే కుట్ర జరుగుతోందని ట్వీట్ చేశారు. అన్ని రంగాల్లో తెలంగాణ ప్రగతిని దెబ్బతీసి.. ఇప్పుడు ఆదాయం కోసం మద్యం అమ్మకాలను కాంగ్రెస్ సర్కార్ నమ్ముకుందంటూ కేటీఆర్ అన్నారు. ఏడాది కిందట ఒక వ్యక్తి మద్యం కోసం రూ. 897 ఖర్చు చేస్తే.. ఏడాదిన్నర కాంగ్రెస్ హయాంలో అది సగటను రూ. 1,623కు పెరిగిందంటూ విమర్శించారు. రేవంత్ హయాంలో పాలన గాలికి.. ప్రగతి కాటికి అన్నట్లు మారిందంటూ ఆయన ఎద్దేవా చేశారు. నాడు కేసీఆర్ పాలనలో పల్లె పల్లెకు ప్రగతి రథచక్రాలు, ప్రతి చేనుకు నీళ్లు ప్రతి చేతికి పని. ఇంటింటికీ తాగునీళ్లు, ఆడబిడ్డలకు తప్పిన ఇబ్బందులు. నాడు ప్రగతి బాట పట్టిన తెలంగాణను తాగుబోతుల తెలంగాణగా మారుస్తున్నారని నిందలు. నేడు పల్లె పల్లెలో మద్యం దుకాణాలు ఏర్పాటు చేసి మద్యం ప్రియుల బలహీనతను రాష్ట్ర ఖజానాకు ఆదాయ వనరుగా మార్చుకునే కుట్ర. అన్ని రంగాల్లో తెలంగాణ ప్రగతిని దెబ్బతీసి, ఇప్పుడు తీరిగ్గా ఆదాయం కోసం మద్యం అమ్మకాలను నమ్ముకున్న అసమర్థ కాంగ్రెస్ సర్కార్.ఏదాది కిందట సగటున ఒక వ్యక్తి మద్యం కోసం చేసే ఖర్చు రూ. 897, ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనలో సగటున ఒక వ్యక్తి మద్యం మీద చేస్తున్న ఖర్చు రూ. 1623కు పెరిగింది. లైసెన్స్ గడువు మూడేళ్లకు పెంచి, దరఖాస్తు ధర రూ. 3 లక్షలకు పెంచాలని నిర్ణయం. ఇందిరమ్మ రాజ్యంలో ఇంటింటికీ మద్యం.. పాలన గాలికి ప్రగతి కాటికి. జాగో తెలంగాణ జాగో" అంటూ కేటీఆర్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. రాష్ట్రంలోని ఎక్సైజ్ విధానంలో కాంగ్రెస్ పార్టీ కొత్త విధానాలు తీసుకురాబోతోంది. స్థానిక సంస్థల ఎన్నికలు ఉండటంతో ముందస్తు నోటిఫికేషన్ జారీ చేయాలంటూ ఇప్పటికే ఎక్సైజ్ శాఖకు కూడా ఆదేశాలు అందాయి. మండల పరిధిలో తక్కువ అమ్మకాలు ఉన్న వైన్స్ షాపులు గుర్తించి వాటిని గ్రామ స్థాయికి మార్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఏ4 దుకాణాలకు ప్రభుత్వం రెండేళ్లు ఉన్న లైసెన్స్ గడవును మూడేళ్లకు పెంచేలా ఎక్సైజ్ శాఖ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.

# ఆపరేషన్ సిందూర్ విజయవంతమైంది

**తరువాయి భాగం**

లక్ష్యంకాదని తేల్చిచెప్పారు. మన దేశానికి చెందిన ఎన్ని విమానాలు కూలాయనే ప్రశ్నల నేపథ్యంలో దేశ భద్రత విషయంలో చిన్న చిన్న విషయాలకు అంత ప్రాధాన్యత ఉండదని స్పష్టం చేశారు. మన సైనికుల సత్తాను ప్రశ్నించడం విపక్షాలకు సరికాదు. ఆపరేషన్ సిందూర్ విజయవంతమైందని గట్టిగా చెబుతున్నా. ఈ ఆపరేషన్ తర్వాత పాక్ సైన్యం మనపై దాడికి దిగింది. పాక్ దాడులను మనం సమర్థంగా తిప్పికొట్టాం. పాక్‌పై మన సైనికులు మిసైళ్లతో విరుచుకుపడ్డారు. ఈ దాడుల్లో పాకిస్థాన్‌లోని మిసైల్ లాంచింగ్ స్టేషన్ ధ్వంసమైంది. అనంతరం పాక్ మనపై జరిపిన దాడులను భారత రక్షణ వ్యవస్థ సమర్థంగా తిప్పికొట్టింది. దాయాది దేశం నుంచి వచ్చిన అన్ని రకాల దాడులను మనం సమర్థంగా అడ్డుకున్నాం అని రాజ్‌నాథ్ అన్నారు. ఆపరేషన్ సిందూర్ చేపట్టిన సైన్యానికి మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అభినందనలు తెలిపారు. పహల్గాం ఉగ్రదాడికి బదులుగా ఆపరేషన్ సిందూర్ పేరుతో సైనిక ఆపరేషన్ చేపట్టామన్నారు. దేశ ప్రజలను రక్షించడం మా ప్రభుత్వ బాధ్యత ఆయన అన్నారు. పహల్గాంలో పర్యటకులపై ఉగ్రదాడి హేయమైన చర్య అని అభివర్ణించారు. ఉగ్రవాదులు పర్యటకుల్ని మతం పేరు అడిగి మరీ కాల్చి చంపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే ఆపరేషన్ సిందూర్‌కు ముందు సైనికులు ముందు జాగ్రత్తలు తీసుకున్నారని తెలిపారు. పాకిస్థాన్‌లోని సామాన్య ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సైన్యం దాడులు జరిపిందని పేర్కొన్నారు

# ఫోన్ అలర్ట్ మెసేజ్ రావడంతో ఫిర్యాదు చేశా

**తెలంగాణ చౌరస్తా, స్టేట్ బ్యూరో:**



ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణకు మాజీ పోలీస్ ఉన్నతాధికారి, బీఆర్ఎస్ కీలక నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ సోమవారం జులై 28 హాజరయ్యారు. విచారణకు హాజరై వాంగ్మూలం ఇవ్వాలని ప్రవీణ్ కుమార్‌కి సిట్ అధికారులు రెండు సార్లు నోటీసులు ఇచ్చిన విషయం తెలిసిందే. తన ఫోన్ బీఆర్ఎస్ ప్రభుత్వం హ్యాక్ చేస్తోందని, ఫోన్ ట్యాపింగ్‌కి పాల్పడుతోందని గతంలో బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు హోదాలో ప్రవీణ్ కుమార్ ఈసీ, డీజీపీకి ఫిర్యాదు చేశారు. ప్రవీణ్ కుమార్ ఫిర్యాదు ఆధారంగానే సిట్ అధికారులు విచారణకు పిలిపించారు. ప్రవీణ్ కుమార్ స్టేట్‌మెంట్ రికార్డ్ చేశారు సిట్ అధికారులు. 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రవీణ్ కుమార్ ఫోన్ ట్యాప్ అయినట్లు సిట్ అధికారులు గుర్తించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రవీణ్ కుమార్ స్టేట్‌మెంట్ ఆసక్తికరంగా మారింది. బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా లేదా అనుకూలంగా ప్రవీణ్ కుమార్ వాంగ్మూలం ఇచ్చాడా అనేది చర్చనీయాంశంగా మారింది. ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రవీణ్ కుమార్ యూటర్న్ తీసుకున్నారు. గతంలో బీఆర్ఎస్ ఫోన్ ట్యాపింగ్ చేస్తోందని, కేసీఆర్ తన ఫోన్ ట్యాపింగ్ చేయిస్తున్నాడని ఫిర్యాదు చేశారు. ప్రవీణ్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదుపై పంజాగుట్టలో ఎఫ్ఐఆర్ నమోదైంది. పంజాగుట్టలో నమోదైన ఎఫ్ఐఆర్‌పై ప్రవీణ్ కుమార్ నుంచి వాంగ్మూలం తీసుకున్నారు సిట్ అధికారులు. యాపిల్ మొబైల్‌కి అలర్ట్ మెసేజ్ రావడంతో గతంలో ఫిర్యాదు చేశానని తెలిపారు ప్రవీణ్ కుమార్. అప్పట్లో ఆయన బీఆర్ఎస్ ప్రభుత్వం, కేసీఆర్‌పై తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేశారు. ఫోన్ ట్యాపింగ్‌ను బీఆర్ఎస్ రాజకీయంగా వాడుకోలేదని ఇప్పుడు మాట మార్చారు ప్రవీణ్ కుమార్. బీఆర్ఎస్‌కి అనుకూలంగా స్టేట్‌మెంట్ ఇచ్చారు. అప్పటి ఫిర్యాదుపై వాంగ్మూలం ఇవ్వమంటే , సీఎం రేవంత్‌రెడ్డిపై ఆయన ఫిర్యాదు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి మంత్రులు, తన ఫోన్ ట్యాపింగ్ చేయిస్తున్నట్లు సిట్‌కి ఫిర్యాదు చేశారు. డార్క్ వెబ్‌సైట్‌లో టూల్స్ ఉపయోగించి ప్రైవేటు వ్యక్తులతో ఫోన్ ట్యాపింగ్ చేయిస్తున్నట్లు ఫిర్యాదు చేశారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్‌ను పావుగా వాడుకుంటోందని కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రవీణ్ కుమార్ విమర్శలు చేశారు.

# కాల్పుల విరమణలో అమెరికా పాత్ర లేదు

**తరువాయి భాగం**

ఊహాగానాలను కొట్టివేశారు. ఏప్రిల్ 22 జూన్ 17 మధ్య ప్రధానమంత్రి మోదీ, డొనాల్డ్ ట్రంప్ మధ్య ఎలాంటి ఫోన్ కాల్ సంభాషణలు జరగలేదని సభకు వివరించారు. భారత్‌పాక్ మధ్య డైరెక్ట్ కమ్యూనికేషన్ అనంతరమే కాల్పుల విరమణపై అవగాహనకు వచ్చినట్టు చెప్పారు. ఇందులో మూడో పార్టీ ప్రమేయం లేదని స్పష్టం చేశారు

పాకిస్థాన్ కాల్పులపై భారత్ విరుచుకుపడటంతో కాల్పుల విరమణకు సిద్ధంగా ఉన్నామంటూ పాక్ నుంచి భారత ప్రభుత్వానికి ఫోన్ కాల్స్ వచ్చాయని, అయితే ప్రొటోకాల్ ప్రకారం ఇలాంటి సమాచారం అధికారికంగా పాకిస్థాన్ డీజీఎంఓ నుంచి రావాలని ఇండియా పట్టుపట్టిందని జైశంకర్ సభకు తెలిపారు.లష్కరే తొయిబా ప్రాక్సీ అయిన ది రెసిస్టెంట్ ఫ్రంట్ (టీఆర్ఎఫ్) ఉగ్రవాద సంస్థగా అమెరికా ప్రకటించడం వెనుక భారత దౌత్యానికి క్రెడిట్ దక్కుతుందని జైశంకర్ అన్నారు. ఉగ్రవాదానికి చిరకాలంగా పాకిస్థాన్ మద్దతిస్తున్న విషయాన్ని ఇండియా బలంగా ప్రపంచ దేశాల ముందుకు తీసుకువెళ్లిందన్నారు. ప్రపంచానికి పాకిస్థాన్ నిజస్వరూపం వెల్లడించడంలో సక్సెస్ అయ్యామని చెప్పారు. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా సహించేది లేదనే విధానాన్ని ఇండియా అనుసరిస్తోందన్నారు. పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదంపై పోరు కేవలం ఆపరేషన్ సిందూర్‌కు పరిమితం కాదని.. దేశ ప్రజలు, వారి ప్రయోజనాలను కాపాడేందుకు అవసరమైన అన్ని చర్యలూ తీసుకుంటామని చెప్పారు. జాతీయ భద్రతపై భారత్ దృఢ వైఖరి కొనసాగిస్తోందని, పాకిస్థాన్ జాతీయులకు వీసా ఆంక్షలు కొనసాగుతాయని వివరించారు. ఉగ్రవాదం ముప్పును ఎదుర్కొనేందుకు అనుసరిస్తున్న విస్తృత వ్యూహంలో భాగంగానే ఈ చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

# దద్దరిల్లిన పార్లమెంట్ ప్రాంగణం

**తెలంగాణ చౌరస్తా, నేషనల్ బ్యూరో:**

బీహార్ ఓటర్ల జాబితా సవరణ (సర్)పై నిరసనలు వరుసగా సోమవారం కూడా కొనసాగాయి. అసాధారణ రీతిలో పార్లమెంట్ భవన ఆవరణలో పలు ప్రతిపక్ష పార్టీలు సర్‌కు వ్యతిరేకంగా నిరసనలకు దిగాయి.ఈ ప్రదర్శనలో ఇప్పుడు కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ, ఖర్గే, రాహుల్, ఎస్‌పి నాయకులు అఖిలేష్ యాదవ్ కూడా పాల్గొన్నారు. సర్ కటౌట్లను చింపివేశారు. సర్‌పేరిట వెలిసిన చెత్త బుట్టల్లో ముక్కలు పడేశారు. దీనితో శుక్రవారం నాటి దృశ్యాలు ఇప్పుడు కూడా ఆవరణలో చోటుచేసుకున్నాయి. బీహార్‌లో ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ మిషతో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఏకంగా ఎన్నికల ప్రక్రియలో జోక్యం చేసుకుందని, ఎన్నికల సంఘం పావు అయిందని ప్రతిపక్ష నేతలు విమర్శించారు. సోనియా , రాహుల్, ప్రియాంక, ఖర్గే ,టిఎంసి ఎంపిలు డెరెక్ ఓ బ్రెయిన్ , డిఎంకె ఎంపి కనిమొళి ఇతరులు ఈ ప్రక్రియ ఉపసంహరణకు డిమాండ్ చేస్తూ నినాదాలకు దిగారు. వారికి ప్రతిపక్ష ఎంపీలంతా వంత పలికారు. దీనితో సభా ప్రాంగణం దద్దరిల్లింది. సర్‌తో ప్రజాస్వామ్య హననం అంటూ భారీ స్థాయిలో కటౌట్లను పట్టుకుని ప్రతిపక్షాలు పార్లమెంట్ ఆవరణలో ప్రదర్శనకు దిగాయి. దీనితో భద్రతా సిబ్బంది అప్రమత్తం కావల్సి వచ్చింది. స్టాప్ సర్ అంటూ ప్రతిపక్షాలు పార్లమెంట్ ఆవరణలో నిరసనకుదిగడం ఇది ఐదోరోజు అయింది. పార్లమెంట్ మకరద్వారం వద్ద ప్రతిపక్ష ఎంపీలు గుమికూడారు. కాంగ్రెస్, టిఎంసి, డిఎంకె, ఆర్జేడీ, వామపక్షాల ఎంపిలు ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు. దీనితో ఇండియా కూటమి సంఘటిత వైఖరి స్పష్టం అయింది. ఈ నిరసనలలో ఆప్ ఎంపిలు కన్పించలేదు. అణగారిన వర్గాల ఓటు హక్కును హరించివేసేందుకు కేంద్రం కుట్ర పన్నిందని, దీనిని అడ్డుకుని తీరుతామని ప్రతిపక్షాలు స్పష్టం చేశాయి. పార్లమెంట్ ఉభయసభల్లోనే కాకుండా వెలుపల కూడా ప్రతిపక్షాలు తమ నిరసనలను ఉధృతం చేయడంతో సర్ వ్యవహారం ఇక ఎటు నుంచి ఎటు దారితీస్తుందనేది వెల్లడికాని పరిస్థితి ఏర్పడిరది. ప్ర జాస్వామ్యం, రాజ్యాంగంపై ఆర్‌ఎస్‌ఎస్ బిజెపిల ఉమ్మడి మనువాద భావాల దాడికి అనుమతించేది లేదని విపక్షాలు స్పష్టం చేశాయి.

# ఇగ వాట్సాప్‌లో ఫిర్యాదు చేయొచ్చు

- ప్రజల కోసం వినూత్న సేవలు,
- హైదరాబాద్ కలెక్టర్ హరిచందన

**తెలంగాణ చౌరస్తా, హైదరాబాద్:**



హైదరాబాద్ జిల్లా ప్రజలకు మరింత సమర్థవంతమైన, వేగవంతమైన సేవలు అందించాలనే సంకల్పంతో జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి వినూత్నంగా వాట్సాప్ ఫిర్యాదు పరిష్కార వ్యవస్థను ప్రవేశపెట్టారు. ఈ కొత్త చొరవ ద్వారా పౌరులు తమ సమస్యలను ఇకపై ప్రభుత్వ కార్యాలయాలను సందర్శించకుండా, వాట్సాప్ ద్వారా నేరుగా తెలియజేసే అవకాశం కలిగింది. ఫిర్యాదు చేసేందుకు నెంబరు ప్రజలు తమ ఫిర్యాదులు, సమస్యలు, సూచనలను 74166 87878 అనే వాట్సాప్ నంబరుకు సందేశంగా పంపించవచ్చు. ఇది ప్రత్యేకంగా ప్రజలతో ప్రభుత్వ వ్యవస్థ మధ్య వాస్తవిక, సత్వర సమాచార మార్పిడిని అందించడానికి రూపొందించా

# బనకచర్ల ప్రాజెక్ట్ ఇంకా స్టార్ట్ కాలేదు

- ప్రాజెక్ట్ సాంకేతిక, ఆర్థిక అంచనా కోసం కేంద్ర జలసంఘానికి వచ్చింది
- ఈ ప్రాజెక్ట్‌పై తెలంగాణ ప్రభుత్వం అభ్యంతరాలు
- కేంద్ర జల శక్తి శాఖ సహాయ మంత్రి రాజ్ భూషణ్ చౌదరి

**తెలంగాణ చౌరస్తా,స్టేట్ బ్యూరో:**

బనకచర్ల ప్రాజక్ట్ పనులు ఇంకా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్ట లేదని కేంద్ర జల శక్తి శాఖ సహాయ మంత్రి రాజ్ భూషణ్ చౌదరి వెల్లడించారు. ఈ ప్రాజెక్ట్ సాంకేతిక, ఆర్థిక అంచనా కోసం ప్రీ ఫీజిబిలిటీ రిపోర్టును ఇప్పటికే కేంద్ర జలసంఘానికి అందించినట్లు తెలిపారు. ఈ ప్రాజక్ట్‌పై తెలంగాణ ప్రభుత్వం అభ్యంతరాలు లేవనెత్తుతూ... లేఖ రాసిందని గుర్తు చేశారు. ఈ ప్రాజక్ట్ సాంకేతిక ఆర్థిక అంచనాల కోసం కేంద్రం తగిన ప్రక్రియను అనుసరిస్తోందని ఆయన స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్ట్‌పై సంబంధిత అధికారులు, పరీవాహక ప్రాంత రాష్ట్రాలతో సంప్రదింపులు జరుపుతున్నట్లు పేర్కొన్నారు. సోమవారం రాజ్యసభలో కాంగ్రెస్ పార్టీ నేత, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ అడిగిన ఒక ప్రశ్నకు సమాధానంగా కేంద్ర జల శక్తి మంత్రి రాజ్ భూషణ్ లిఖిత పూర్వకంగా సమాధానమిచ్చారు.సముద్రంలోకి వృథాగా వెళ్లే గోదావరి మిగులు జలాలను రాయలసీమకు తరలించి.. సస్యశ్యామలం చేయాలని చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం సంకల్పించింది. ఆ క్రమంలో గోదావరిపై బనకచర్ల ప్రాజెక్ట్‌ను రూ. 81,900 కోట్లతో నిర్మించాలని నిర్ణయించింది. దీనిపై తెలంగాణ ప్రభుత్వం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఆ క్రమంలో అఖిల పక్షం ఏర్పాటు చేసి.. ఈ ప్రాజెక్ట్ నిర్మాణానికి వ్యతిరేకంగా తీర్మానం చేశారు. అనంతరం సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలోని పలువురు మంత్రులు ఢిల్లీలోని కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌ను కలిసి.. బనకచర్ల నిర్మాణాన్ని అడ్డుకోవాలని.. ఈ ప్రాజెక్ట్ నిర్మాణం వల్ల తెలంగాణకు భవిష్యత్తులో కలిగే సమస్యలను వివరించింది. . ఇటీవల న్యూఢిల్లీ వేదికగా కేంద్ర జల శక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ అధ్యక్షతన తెలుగు రాష్ట్రాల సీఎంలు నారా చంద్రబాబు నాయుడు, రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు.

తెలంగాణ చౌరస్తా


# కృత్రిమ 'సృష్టి' కల్లోలం



> అమ్మా అనే పిలుపులో ఓ అద్భుతమైన అనుభూతి ఉంటుంది. ప్రపంచంలోని విజయా లన్ని ఓ ఎత్తు తల్లి కావడం మరో ఎత్తు అంటారు మన పెద్దలు. ఈ సృష్టిని ముందుకు తీసుకువెళ్లే శక్తి ఆ ఒక్క మాతృత్వానికే ఉంటుంది. అంతటి గొప్ప వరం అందిరికీ సొంతం కాకపోవచ్చు. అలా అని ఢీలాపడాల్సిన అవసరం లేదు. పెరుగుతున్న సాంకేతిక పరిజ్ఞానంతో అనేక ఆధునిక పద్ధతుల ద్వారా సంతానం పొందే అవకాశాలు ఏటికేడు పెరుగుతున్నాయి. అలాంటి కొన్ని పద్ధతులే ఇంట్రా యుటిరైన్ ఇన్ సిమినేషన్–I.U.I, ఇన్ విట్రో ఫర్టిలైజేషన్–I.V.F, సరోగసి ఇలా అనేక పద్ధతులు.

## పేరుతో శిశువుల అక్రమ రవాణా

- పేద మహిళలే టార్గెట్‌గా ఫెర్టిలిటీ కేంద్రం దందా
- నిబంధనలకు నీళ్లొదిలి అడ్డగోలుగా వ్యాపారం
- వైద్యారోగ్య శాఖ పాత్రపైనా ఎన్నో అనుమానాలు!?
- ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో కలకలం రేపుతున్న ఘటన
- సరోగసీ చట్టాలు ఏం చెబుతున్నాయి?
- సృష్టి వ్యవహారం మనకు ఎలాంటి పాఠాలు నేర్పుతోంది
- సరోగసి పేరుతో శిశువుల అక్రమ రవాణా చేసిన సృష్టి ఫెర్టిలిటీ కేంద్రం
- ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి ఇష్టారీతిన వ్యవహారం
- ఇటీవల రాష్ట్రంలో సంచలనం రేపుతున్న సృష్టి ఫెర్టిలిటీ సెంటర్ ఘటన



### పది లక్షలు జరిమానా

అటు I.V.F క్లినిక్‌లు సైతం కొన్ని నిబంధనలు పాటించాల్సిన అవసరం ఉంది. అసిస్టెడ్ రీప్రొడక్టివ్ టెక్నాలజీ రెగ్యులేషన్ యాక్ట్–A.R.Tప్రకారం లైసెన్సింగ్, చట్టబద్ధమైన నిబంధనలు పాటించాలి. ప్రతి క్లినిక్, బ్యాంకు తప్పనిసరిగా ప్రభుత్వం వద్ద నమోదు చేసుకోవాలి. జాతీయ, రాష్ట్ర స్థాయిలో నిబంధనల బోర్డులు వాటిని నిత్యం పర్యవేక్షించాలి. మార్గదర్శకాలకు లోబడి I.V.Fలు నిర్వహించాలి. డోనార్ డేటాకు భద్రత ఉండాలి. కనీసం 25 ఏళ్ల పాటు రికార్డులను భద్రపరచాల్సి ఉంటుంది. నిబంధనలు పాటించకుండా ఉల్లంఘనలకు పాల్పడితే తొలిసారి ఐదు నుంచి పది లక్షలు జరిమానా అదే తప్పు మళ్లీ చేస్తే 8 నుంచి 12 ఏళ్ల జైలు శిక్షణ పది నుంచి 12లక్షల జరిమానా పడే అవకాశం ఉందని చట్టాలు చెబుతున్నాయి.

**తెలంగాణ చౌరస్తా, హెల్త్ డెస్క్ :**

"ఇలాంటి క్లినిక్స్కు పిల్లలు కావాలనుకునే తల్లిదండ్రులు చాలా ఆకర్షితులవుతున్నారు. ప్రభుత్వ నిబంధనల కంటే క్లినిక్ వారు చాలా సులువైన దారి చూపుతున్నారు. మీరు ఇన్ని డబ్బులు ఇస్తే మీకు శిశువును అప్పగిస్తామని చెబుతున్నారు. ఇది చాలా మంది తెలియదు. రూరల్ ప్రాంతాల నుంచి వచ్చే వారికి అసలు ఏమి తెలియదు. భారతదేశంలో కమర్షియల్ సరోగసీపై నిషేదం ఉంది" రష్మీ పెరుమాళ్, నార్త్జోన్ డీసీపీ దంపతులు వారికున్న ఆరోగ్య సమస్యల ఆధారంగా, వైద్యుల సలహా మేరకు I.U.I, I.V.F, సరోగసి వంటి పద్ధతులను అవలంభిస్తుంటారు. ఆహారంలో మార్పులు, వ్యాయామం లేకపోవటం, ఒత్తిడి కారణం ఏదైనా ఏటికేడు స్త్రీ పురుషుల్లోనూ ఇన్ ఫెర్టిలిటీ సమస్యలు పెరుగుతున్నాయి. ప్రతి 6 జంటల్లో ఒకరు ఇన్ ఫెర్టిలిటీ సమస్యను ఎదుర్కొంటున్నారు. మన దేశంలోనూ వారి సంఖ్య లక్షల్లో ఉంది. అమ్మానాన్న అనే పిలుపు కోసం ఏం చేయడానికైనా ఎంత కష్టానికైనా సిద్ధం అనేలా ఉంటున్నాయి పరిస్థితులు. పిల్లలు లేరు అన్న బాధ ఒకటైతే, పిల్లలు లేరా? అన్న సమాజం ప్రశ్నలు వారిని మరింత కుంగదీస్తున్నాయి.

పిల్లలు లేని వారి అవసరాలను ఆసరాగా చేసుకుని పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న సంతాన సాఫల్య కేంద్రాలు అక్రమాలకు తెగబడుతున్నాయి. కాసులకు కక్కుర్తిపడి మాతృత్వానికి బేరసారాల వ్యాపారాన్ని జత చేస్తున్నాయి. ఇందుకు ఓ ఉదాహరణే యూనివర్సల్ సృష్టి ఫెర్టిలిటీ కేంద్రం ఘటన. సాధారణంగా ఫెర్టిలిటీ కేంద్రాల్లో ఐదు, పది వేలు ఇస్తామని ఆశ చూపి విద్యార్థినులు, పేద మహిళల నుంచి అండాలు సేకరిస్తున్నారన్న ఆరోపణలు తరచూ వినిపిస్తున్నాయి.

**పేద మహిళలకు ఒకటి రెండు లక్షలు చెల్లించి వారిని సరోగసికి ఒప్పించిన ఘటనలు అప్పుడప్పుడు బయటపడుతుంటాయి. కానీ, ఇది అంతకు మించిన దుర్మార్గపు ఆలోచన. లక్షలకొద్దీ వసూలు చేసి అసలు ప్రొసీజరే చేయకుండా వేరే పిల్లల్ని తీసుకొచ్చి అప్పగిస్తున్నారు. ఇప్పుడు సృష్టి కేసులో ఒక దంపతుల వద్ద బాబును కొన్నట్లు పోలీసులు గుర్తించారు. మిగిలిన కేసుల్లో అసలేం జరుగుతోంది? పిల్లల అక్రమ రవాణా ముఠాలకు, వీళ్లకు సంబంధం ఉన్న అనుమానాలు వెలుగులోకి వస్తున్నాయి. ఇప్పుడు పోలీసులూ అదే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.**

ఇక్కడ సమాజం గమనించాల్సిన విషయం ఒకటి ఉంది. లైసెన్స్ పూర్తయిన వైద్యురాలు చికిత్సలు చేస్తుంటే వైద్య ఆరోగ్య శాఖ మొద్దు నిద్రపోతుందా? అనే సందేహం వ్యక్తం అవుతోంది. 2సార్లు తనిఖీలు చేసినా ఆస్పత్రిలో ఎవరు లేరని ఆరోగ్య శాఖ అధికారులు చెబుతున్నారు. ఐతే, ఇలాంటి ఫెర్టిలిటీ క్లినిక్‌లపై తరచూ ఆరోపణలు వస్తున్నా గతంలోనే డాక్టర్ నమ్రతపై కేసులు ఉన్నా మరింత కఠిన మైన చర్యలు తీసుకోకపోవటం వెనక కారణం ఏంటి? సరోగసి ద్వారా బిడ్డను కనేందుకు సోనాలీ, గోవింద్ దంపతులు అంగీకరించారు సరే మరే చట్టాల సంగతేంటి? అంటే సరోగసీకి అనేక నియమాలు ఉన్నాయి. ఫెర్టిలిటీ కేంద్రాలు ఇష్టారాజ్యంగా ఎవరికి పడితే వారికి సరోగసీ చేయటానికి వీల్లేదు.

సరోగసీ నియంత్రణ చట్టం2021, సహాయత పునరుత్పాదక సాంకేతికత నియంత్రణ చట్టం2021 వంటివి ఉన్నాయి. సరోగసీ నియంత్రణ చట్టం 2021 యాక్ట్‌ని 2024లో కొన్ని సవరణలు చేశారు. దీని ప్రకారం సరోగసీ ద్వారా సంతానం పొందాలనుకునే దంపతులకు పెళ్లయి ఐదేళ్లు పూర్తికావాలి. వీరికి గతంలో పిల్లలు, దత్తత తీసుకున్న సంతానం ఉండకూడదు. ఈ నిబంధనల ప్రకారం భర్తకు 2655, భార్యకు 2550 ఏళ్ల మధ్య వయసు ఉండాలి. దంపతుల్లో ఒకరికి ఇన్‌ఫెర్టిలిటీ సమస్య ఉన్నట్టు జిల్లా మెడికల్ బోర్డు ధ్రువపత్రం తప్పకుండా తీసుకోవాలి. జన్మించిన బిడ్డ సంరక్షణ హక్కులకు మేజిస్ట్రేట్ అనుమతి తప్పనిసరిగా ఉండాలని నిబంధనలు చెబుతున్నాయి.



### సరోగసీ రెగ్యులేషన్ యాక్ట్-2021

అలాగే గర్భాన్ని అద్దెకిచ్చే మహిళకు వివాహమై ఒక బిడ్డకు జన్మనిచ్చి ఉండాలి. సదరు మహిళ ఒకసారి మాత్రమే అద్దెగర్భం ఇవ్వాలి. అది కూడా సమీప బంధువులకు మాత్రమే ఇవ్వాలి. ప్రసవానంతరం ఆ మహిళకు 16నెలల బీమా సౌకర్యం కల్పించాలని సరోగసీ రెగ్యులేషన్ యాక్ట్2021లో ఉంది. దాంతోపాటు గర్భాన్ని అద్దెకు ఇచ్చిన మహిళకు, ఆమె ప్రసవించబోయే బిడ్డకు మధ్య జన్యుపరమైన బంధమేదీ ఉండదని సర్వోన్నత న్యాయస్థానానికి కేంద్ర ప్రభుత్వం తెలిపింది.

ఓ కేసు విచారణ సందర్భంలో సరోగసీ చట్ట నిబంధనలకు సంబంధించి ఈ వివరణ ఇచ్చింది. అంటే, ఈ చట్టం ప్రకారం తన బీజకణం లేదా శుక్లధాతువు ఇచ్చే మహిళ సరోగసీ అమ్మ కాబోదని స్పష్టం చేసింది. తల్లిదండ్రులు కావాలని కోరుకుంటున్న దంపతులతో సరోగసీ విధానంలో జన్మించబోయే బిడ్డ జన్యుపరమైన బంధాన్ని కలిగి ఉండాలని తెలిపింది. భర్త వీర్యం, భార్య మాతృజీవకణాలతో రూపొందిన పిండం మరో మహిళ గర్భంలో పెరుగుతుం దని వివరించింది. భర్తతో విడిపోయిన, విధవరాలైన మహిళల విషయంలో అయితే ఆమె శుక్లధాతువును అందజేయాల్సి ఉంటుందని పేర్కొంది.

సరైన లైసెన్సులు లేకుడానే కాసులకు కక్కుర్తిపడి పిల్లలు కావాలనుకునే వారికి అక్రమంగా చికిత్స అందిస్తున్నారు డాక్టర్ నమ్రత. ఏకంగా ఏజెంట్లను నియమించుకుని మరీ గర్భవతులను గుర్తించి వారి బిడ్డను సరోగసి ద్వారా పుట్టిన బిడ్డగా నమ్మించే ప్రయత్నం చేశారంటే వారు ఈ విషయంలో ఎంత పకడ్బందీగా వ్యవహరిస్తున్నారో అర్థం అవుతుంది. గర్భిణిని హైదరాబాద్‌లో గుర్తించి విశాఖపట్నం పిలిపించి పురుడు పోసింది.

### టిప్ ఆఫ్ ది ఐస్ బర్గ్

బిడ్డను విశాఖపట్నంలోనే సోనాలీ, గోవింద్ దంపతులకు అప్పగించిన తీరు చూస్తుంటే తెలుగు రాష్ట్రాల్లోనూ ఫెర్టిలిటీ కేంద్రాల తనిఖీల విషయంలో అధికారుల అలసత్వం కళ్లకు కట్టినట్లు చూపిస్తోంది. అలాంటప్పుడు సోనాలీ, గోవింద్ లే తొలి బాధితులని ఎలా అనుకోగలం. గతంలోనూ ఇలాంటి అక్రమాలకు పాల్పడే అవకాశం లేకపోలేదని ఇలాగే ఇది కేవలం టిప్ ఆఫ్ ది ఐస్ బర్గ్ అంటూ ఏకంగా డీసీపీ రష్మీ పెరుమాళ్ అన్న మాటలే ఈఘటన తీవ్రతకు అద్దం పడుతున్నాయి. వ్యవస్థల్లోని లోపం, ఓ ఫర్టిలిటీ కేంద్రం అత్యాశ, మాతృత్వం కోసం లక్షలు పోసేందుకు సిద్ధపడినా తమ రక్తం కాదనుకునే కుంచిత మనస్తత్వం ఉన్న దంపతుల ఆలోచన, పెంచే స్థోమత లేక డబ్బుకోసం అమ్మతనాన్ని అమ్ముకున్న స్త్రీ మూర్తి ఇలా క్షణ క్షణం ఓ కొత్త కోణం వెలుగులోకి వస్తోంది. ప్రస్తుతం సృష్టి యూనివర్సల్ ఫెర్టిలిటీ కేంద్రం మాత్రమే వెలుగులోకి వచ్చింది. కానీ, ఎవ్వరికీ దొరకకుండా, నిబంధనలు పాటించకుండా చీకటిలో దాందా సాగిస్తున్న వారిపై చర్యలేవని వేలెత్తి చూపుతోందీ ఉదంతం



# పట్టు పరిశ్రమలో దశాబ్దాల సేవ

- మహమ్మద్ రషీద్ కు ఘన వీడ్కోలు
- తుమ్మనపల్లి గ్రామపట్టు రైతులు


**భీమదేవరపల్లి, తెలంగాణ చౌరస్తా :**

దశాబ్దాల పాటు పట్టు పరిశ్రమ శాఖలో రైతులకు విశేష సేవలందించిన మహమ్మద్ రషీద్ జూలై 31న పదవీ విరమణ చేస్తున్న సందర్భంగా హుజురాబాద్ మండలం తుమ్మనపల్లి గ్రామ పట్టు రైతులు ముల్కనూర్ లో ఘనంగా సన్మానించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ సెరికల్చర్ అధికారిగా ఆయన చివరి సేవలను హుజురాబాద్ మండలంలో అందించారు. రషీద్ గతంలో ఖమ్మం, వరంగల్, కరీంనగర్ పాత జిల్లాల్లో వివిధ హోదాల్లో పని చేసి, తన కెరీర్ పొడవునా రైతు సంక్షేమానికే ప్రాధాన్యతనిచ్చారు. పట్టు రైతులకు మెరుగైన దిగుబడులు సాధించడానికి అవసరమైన సలహాలు, సూచనలు అందిస్తూ, వారి ఆర్థికాభివృద్ధికి ఎంతగానో తోడ్పడ్డారు. పట్టు పరిశ్రమ ఎదుర్కొంటున్న సవాళ్లను అధిగమించడంలో ఆయన కృషి గణనీయమైనది. ఆయన నిస్వార్థ సేవ, అంకితభావం అధికారులు, రైతులు, మరియు ప్రముఖుల మన్ననలను పొందింది. పదవీ విరమణ సందర్భంగా ఏర్పాటు చేసిన సన్మాన మహోత్సవంలో పలువురు అధికారులు, ప్రజా ప్రతినిధులు, పట్టు రైతులు పాల్గొని రషీద్ సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా రషీద్ మాట్లాడుతూ, రైతుల సేవలో తన జీవితాన్ని గడపడం సంతృప్తినిచ్చిందని పేర్కొన్నారు. మహమ్మద్ రషీద్ పదవీ విరమణానంతరం సుఖమయమైన, ఆరోగ్యకరమైన జీవితం గడపాలని ఆకాంక్షిస్తూ పలువురు శుభాకాంక్షలు తెలిపారు

# నాగుల పంచమి సందర్భంగా జంటనాగులు, సుబ్రహ్మణ్య స్వామి విగ్రహాల ప్రతిష్టాపన

- ముల్కనూర్ అయ్యప్ప స్వామి ఆలయ ప్రాంగణం
- భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలి

**భీమదేవరపల్లి తెలంగాణ చౌరస్తా :**



మండలంలోని ముల్కనూర్ లో మంగళవారం, జూలై 29, 2025 న, శ్రీ విశ్వేశ్వర సహిత అయ్యప్ప ఆలయంలో జంట నాగులు, సుబ్రహ్మణ్యస్వామి నూతన విగ్రహాలను ప్రతిష్టాపించనున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించ బడతాయి. భక్తులందరూ ఈ సువర్ణావకాశాన్ని సద్వినియోగం చేసుకొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆలయ కమిటీ మనస్ఫూర్తిగా కోరుతోంది. ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారి దర్శనం చేసుకోవాలని ఆలయ కమిటీ సభ్యులు విజ్ఞప్తి చేశారు



# ఉచిత మెగా నేత్ర వైద్య శిబిరం

**సుల్తానాబాద్,(తెలంగాణ చౌరస్తా):**

సుల్తానాబాద్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మండలంలోని గర్రెపల్లి గ్రామ పంచాయతీ ఆవరణలో ఉచిత మెగా నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. సోమవారం గర్రెపల్లి గ్రామంలో నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి విశేష ఆదరణ లభించింది.రేకుర్తి కంటి ఆసుపత్రి సహకారంతో ఆస్పత్రి టెక్నీషియన్ ప్రభాకర్ 230 మందికి కంటి పరీక్షలు నిర్వహించి,అందులో 39 మంది రోగులను కంటి ఆపరేషన్ కొరకు ఎంపిక చేసి ఉచిత రవాణా,భోజన సదుపాయం కల్పించి కరీంనగర్ లోని రేకుర్తి కంటి ఆసుపత్రికి తరలించారు.ఈ సందర్భంగా క్లబ్ ప్రతినిధులు, స్థానిక ఎంపీడీవో, మాజీ ప్రజా ప్రతినిధులు మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంతంలోని ప్రజలకు ఆరోగ్యం పట్ల అవగాహనను పెంచుకోవడానికి ఈ ఉచిత వైద్య శిబిరాలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. సర్వేంద్రియానం నయనం ప్రధానం శరీరంలోని కళ్ళు అతి ముఖ్యమైనవని, కంటి సమస్యలను ఏమాత్రం అశ్రద్ధ చేయకుండా, డాక్టర్ల సలహాలు, సూచనలు తీసుకుని జాగ్రత్తగా ఉండాలని సూచించారు .ఈ సందర్భంగా శిబిరంలో పాల్గొన్న రోగులతో పాటు స్థానిక ప్రజలు లయన్స్ క్లబ్ సేవలను అభినందిస్తూ, కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు జూపల్లి తిరుమల్ రావు, స్థానిక ఎంపీడీవో దివ్య దర్శన్ రావు, 320జి జి.ఈ.టి మిట్టపల్లి ప్రవీణ్ కుమార్, జిల్లా చీఫ్ కోఆర్డినేటర్ వలస నీలయ్య, జిల్లా కోఆర్డినేటర్లు మాటేటి శ్రీనివాస్, జూలూరి అశోక్, పూర్వ అధ్యక్షులు గజబింకార్ జగన్, దీకొండ భూమేష్ తోపాటు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు

# సృష్టి కేసులో వెలుగులోకి సంచలన విషయాలు

- పోలీసుల దర్యాప్తులో షాకింగ్ విషయాలు
- ఈ కేంద్రంలో టెస్ట్ ట్యూబ్ బేబీ (ఐవీఎఫ్) పద్ధతి జరగలేదు
- వేరొకరికి పుట్టిన బిడ్డలను తీసుకొచ్చి అద్దె గర్భం ద్వారా పుట్టారని మోసం
- డాక్టర్ నమ్రత దంపతుల నుంచి రూ.40 లక్షల వరకు వసూలు
- బిడ్డల అక్రమ రవాణా చైల్డ్ ట్రాఫికింగ్

**తెలంగాణ చౌరస్తా, స్టేట్ బ్యూరో :**




హైదరాబాద్‌లో సంచలనం సృష్టించిన సృష్టి టెస్ట్ ట్యూబ్ బేబీ కేసులో పోలీసుల దర్యాప్తులో షాకింగ్ విషయాలు వెలుగులోకి వచ్చాయి. అసలు ఈ కేంద్రంలో టెస్ట్ ట్యూబ్ బేబీ (ఐవీఎఫ్) పద్ధతి జరగలేదని.. బయట వేరొకరికి పుట్టిన బిడ్డలను తీసుకొచ్చి, సంతానం లేని దంపతులకు అద్దె గర్భం ద్వారా పుట్టారని నమ్మించి ఇచ్చినట్లు పోలీసులు తేల్చారు. ఈ దారుణ మోసం ద్వారా డాక్టర్ నమ్రత దంపతుల నుంచి రూ.40 లక్షల వరకు వసూలు చేసినట్లు వెల్లడైంది. ఇది కేవలం వైద్య మోసం కాదని.. బిడ్డల అక్రమ రవాణా (చైల్డ్ ట్రాఫికింగ్) అని పోలీసులు పేర్కొన్నారు.

**రాజస్థాన్ జంట ఫిర్యాదుతో వెలుగులోకి..**

ఈ కేసు వివరాలను నార్త్ జోన్ డీసీపీ రష్మి పెరుమాళ్ మీడియాకు వెల్లడించారు. గోపాలపురంకు చెందిన ఒక జంట ఇచ్చిన ఫిర్యాదుతో సృష్టి టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్‌పై రైడ్ చేశామని డీసీపీ తెలిపారు. రాజస్థాన్‌కు చెందిన ఒక దంపతులు ఆన్‌లైన్‌లో సృష్టి టెస్ట్ ట్యూబ్ సెంటర్ గురించి తెలుసుకుని డాక్టర్ నమ్రతను సంప్రదించారు. సరోగసి (అద్దె గర్భం) పద్ధతిలో పిల్లలు పుట్టించడానికి రూ.30 లక్షలు అవుతుందని నమ్రత వారికి చెప్పింది. దీంతో దంపతులు విజయవాడ వెళ్లి, అక్కడ తమ శాంపిల్స్ ఇచ్చారు. సరోగసి కోసం అద్దె గర్భం మోసే మహిళ దొరికిందని డాక్టర్ వారికి నమ్మబలికింది.
కొన్ని నెలల తర్వాత బాబు పుట్టాడని ఆ జంటకు డాక్టర్ నమ్రత చెప్పింది. సిజేరియన్ ద్వారా డెలివరీ అయిందని అబద్ధం చెప్పి.. అదనంగా మరో రూ.10 లక్షలు వసూలు చేసింది. దీంతో మొత్తం రూ.40 లక్షలు దంపతుల నుంచి లాగేసింది. అయితే.. కొన్ని నెలల తర్వాత ఆ బాబు పోలికలు ఆ దంపతులకు అనుమానాస్పదంగా అనిపించాయి. దీంతో వారు డీఎన్ఏ టెస్ట్ చేయాలని డాక్టర్‌ను కోరారు. ఇందుకు నమ్రత అస్సలు ఒప్పుకోలేదు. దాంతో దంపతులు ఢిల్లీలో డీఎన్ఏ టెస్ట్ చేయించారు. ఆ పరీక్షలో ఆ బిడ్డ తమకు చెందినది కాదని.. మరొకరి డీఎన్ఏగా తేలడంతో దంపతులు డాక్టర్ నమ్రతను నిలదీశారు. అయితే.. నమ్రత తన కొడుకు జయంత్ కృష్ణతో కలిసి బాధితులను బెదిరింపులకు పాల్పడింది. జయంత్ కృష్ణ తాను న్యాయవాదినని చెప్పుకొని బెదిరించాడు.

**బిడ్డల అక్రమ రవాణా..**

డాక్టర్ నమ్రత చేసింది నిజానికి సరోగసి కాదు. వేరే మహిళకు పుట్టిన బిడ్డను తీసుకొచ్చి, సరోగసి ద్వారా మీకు పుట్టిన బిడ్డ అని దంపతులను నమ్మించింది. ఢిల్లీకి చెందిన ఒక గర్భిణిని ఫ్లైట్‌లో వైజాగ్ తీసుకొచ్చి, అక్కడ డెలివరీ చేసి, ఆమెకు పుట్టిన బిడ్డను ఆ రాజస్థాన్ దంపతులకు ఇచ్చింది. బిడ్డను వద్దనుకున్న ఆ మహిళకు రూ.90 వేలు చెల్లించినట్లు పోలీసులు గుర్తించారు.
సృష్టి టెస్ట్ ట్యూబ్ సెంటర్‌కు సరైన అనుమతులు లేవని, ఆ ఆస్పత్రి రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లకు 2021లోనే గడువు తీరిందని డీసీపీ రష్మి పెరుమాళ్ తెలిపారు. హైదరాబాద్ DM & HO వెంకట్ కూడా ఈ రైడ్‌లో పాలుపంచుకుని.. 2020లోనే వారి అనుమతులు ముగిశాయని, ఆసుపత్రి మూసేస్తున్నామని వారు చెప్పారని.. క్లోజింగ్ సర్టిఫికెట్ కూడా ఇచ్చామని చెప్పారు. అయినా అక్రమంగా టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్‌ను నడుపుతున్నారని ఆయన అన్నారు.
సెంటర్‌లో థియేటర్, అనస్థీషియా ల్యాబ్, బెడ్స్, 7 రకాల అనాలసిస్ చేసే ఎక్విప్‌మెంట్ ఉన్నాయని, డస్ట్ బిన్ చెక్ చేస్తే రెగ్యులర్ ప్రాసెస్ చేస్తున్నట్లు ఆధారాలు సేకరించామని పోలీసులు తెలిపారు. డాక్టర్ నమ్రతపై రెండు రాష్ట్రాల్లో 10కి పైగా కేసులు ఉన్నాయని, ఐవీఎఫ్ ఫెయిల్యూర్, సరోగసిలో అక్రమాలు వంటి కేసులు ఉన్నాయని డీసీపీ పేర్కొన్నారు. ఈ కేసులో ఇంకా చాలా మందికి పాత్ర ఉందని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇలాంటి అక్రమ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కేసులో ఇప్పటివరకు 8 మంది నిందితులను అరెస్ట్ చేసి, ఏడుగురిని రిమాండ్‌కు తరలించారు.

# మీనాక్షి నటరాజన్ పాదయాత్ర



**తరువాయి భాగం**

తెలుసుకోవడం, ప్రభుత్వ పథకాల అమలును పరిశీలించడమే లక్ష్యంగా ఈ యాత్ర సాగుతుంది. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పార్టీని బలోపేతం చేసేందుకు, నేతల మధ్య సమన్వయం కుదిర్చేందుకు ఆమె కృషి చేయనున్నారు. జూలై 31 నుంచి ఏడు రోజుల పాటు జిల్లాల్లో పాదయాత్ర కొనసాగుతుంది.
రాష్ట్రంలో అధికార కాంగ్రెస్ మరోసారి పాదయాత్ర చేసేందుకు సిద్ధమైంది. సార్వత్రిక ఎన్నికల ముందు రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర పేరుతో తెలంగాణ రాష్ట్రంలో పర్యటించి పార్టీని గెలిపించుకున్నారు. అయితే అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర తర్వాత కాంగ్రెస్ పార్టీ మరోసారి ప్రజల్లోకి వెళ్లేందుకు సిద్ధమైంది. ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ ఆరు నియోజకవర్గాల్లో పాదయాత్ర చేయనున్నారు. మీనాక్షి నటరాజన్ పాదయాత్రకు సంబంధించి రూట్ మ్యాప్ కూడా సిద్ధమైంది. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకునేందుకే ఈ పాదయాత్ర ప్లాన్ చేసినట్లు తెలుస్తోంది. ప్రజలతో మమేకం అవుతూ శ్రమదానం కూడా ఆమె చేయనున్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రారంభించిన జై భీమ్, జై బాపూ, జై సంవిధాన్ నినాదాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడమే ప్రధాన లక్ష్యంగా తెలుస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికల నగారా కూడా త్వరలోనే మోగనుండటంతో.. పార్టీ నాయకత్వాన్ని బలోపేతం చేసే దిశగా మీనాక్షి నటరాజన్ ప్రణాళికలు రచిస్తున్నారు. క్షేత్ర స్థాయిలో పార్టీ నేతల మధ్య సమన్వయం నెలకొల్పేందుకు ఆమె కృషి చేయనున్నారు. ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరును ఆమె స్వయంగా అడిగి తెలుసుకోనున్నారు. రాష్ట్రంలో 15 రోజులు పాటు ఉండనున్న ఆమె.. జూలై 29న పీసీసీ చీఫ్‌తో సమావేశం కానున్నారు. ఈ నెల 31 నుంచి ఏడు రోజుల పాటు జిల్లాల్లో ఆమె పాదయాత్ర మొదలవ్వనుంది. పరిగి సెగ్మెంట్ నుంచి పాదయాత్ర ప్రారంభించనున్న ఆమె తొలి దఫాలో పరిగి, అందోల్, ఆర్మూర్, ఖానాపూర్, చొప్పదండి, వర్ధన్నపేట సెగ్మెంట్లలో పర్యటిస్తారు. ప్రతి ఉమ్మడి జిల్లాలోని ఒక నియోజకవర్గంలో పాదయాత్రతో పాటు రాత్రి బస కూడా ఏర్పాటు చేయాలని ఆమె భావిస్తున్నారు. రాష్ట్రంలోని అన్ని ఉమ్మడి జిల్లాలలో పాదయాత్ర చేసేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు సమాచారం. ఒకవైపు పాదయాత్రలు చేస్తూనే మరోవైపు జిల్లాల పార్టీ ఇన్‌చార్జిలతో ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో మీటింగ్ కూడా నిర్వహించనున్నారు. దీనిలో భాగంగానే ముందుగా పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్‌తో నేడు సమావేశం కానున్నారు. ఆ తర్వాత ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో వన్ టు వన్ మీటింగ్ నిర్వహించి.. రాష్ట్రంలోని పాలన, గ్రూపు రాజకీయాలపై సమాచారం తెలుసుకోనున్నారు.

# నేడు పటాన్ చెరులో నూతన రేషన్ కార్డుల పంపిణీ

- జిల్లా అధికారులు, రేషన్ డీలర్లతో సమీక్ష ఎమ్మెల్యే జీఎంఆర్ సమీక్ష
- అర్హు లైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డు అందిస్తాం
- ఉచిత రేషన్ బియ్యాన్ని దుర్వినియోగం చేయద్దు..
- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

**పటాన్ చెరు, తెలంగాణ చౌరస్తా:**



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని పటాన్ చెరు నియోజకవర్గంలో ఈ నెల 29వ తేదీన పటాన్ చెరు పట్టణంలోని ఎంపీపీ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. సోమవారం పటాన్ చెరు పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో నూతన రేషన్ కార్డుల పంపిణీ అంశంపై జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి స్వరూప, ఆయా మండలాల తహసిల్దారులు, రేషన్ డీలర్ల ప్రతినిధులతో ఎమ్మెల్యే జిఎంఆర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని గుమ్మడిదల, జిన్నారం, అమీన్ పూర్, పటాన్ చెరు, రామచంద్రపురం రెవెన్యూ మండలాల పరిధిలో నూతన రేషన్ కార్డుల కోసం 9414 దరఖాస్తులు రాగా.. అర్హులైన 2096 దరఖాస్తులు ఆమోదించినట్లు తెలిపారు. ప్రస్తుతం నియోజకవర్గం వ్యాప్తంగా 74,214 రేషన్ కార్డులు వినియోగంలో ఉన్నాయని తెలిపారు. నూతన రేషన్ కార్డుల జారీ ప్రక్రియ నిరంతరంగా కొనసాగుతుందని.. అర్హులైన ప్రతి ఒక్కరూ మీసేవ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రేషన్ కార్డుల ద్వారా బియ్యం పంపిణీలో ఎలాంటి అవకతవకలు లేకుండా చర్యలు తీసుకోవాలని తహసిల్దార్లను ఆదేశించారు. నూతన రేషన్ కార్డులు మంజూరైన ప్రతి లబ్ధిదారుడు సమావేశానికి హాజరుకావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. లబ్ధిదారులందరూ హాజరయ్యేలా ఆయా మండలాల తహసిల్దార్లు సమన్వయం చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారి దేవుజా, ఆయా మండలాల తహసిల్దార్లు, రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు రాజు, తదితరులు పాల్గొన్నారు.





# మాటలతో కాదు...మిల్క్ మిషన్‌తో మహిళల శక్తి

- ఆవు పాలు వెనుక ఆదాయవెలుగు
- డెయిరీ ప్రారంభం నుండి ఇప్పటి వరకు 123 కోట్ల బోనస్ పంపిణీ
- సంఘాలకు సబ్సిడీగా 93,80,907 లక్షల పంపిణీ

**భీమదేవరపల్లి తెలంగాణ చౌరస్తా :**
ముల్కనూర్ మహిళా డెయిరీ 23వ వార్షిక మహాసభలు సోమవారం గ్రామ డెయిరీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ మహాసభలో డెయిరీ అభివృద్ధి, ఆర్థిక స్థితి, భవిష్యత్తు ప్రణాళికలు, సభ్యులకు ప్రయోజనాల పెంపు తదితర అంశాలపై విశ్లేషణాత్మకంగా చర్చించారు.

**ఆర్థిక లెక్కల వివరాలు**
డెయిరీ జనరల్ మేనేజర్ మార్పాటి భాస్కర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఫైనాన్స్ ఇంచార్జ్ మద్ది అజయ్ 2024 ఏప్రిల్ 1 నుండి 2025 మార్చ్ 31 వరకు ఆస్తి-బాధ్యతల పట్టిక, లాభనష్టాల ఖాతా, జమలుచెల్లింపుల వివరాలను సభలో ప్రవేశపెట్టారు. సభ్యులు అడిగిన వివిధ ఆర్థిక, పాలనా సంబంధిత ప్రశ్నలకు మేనేజర్ సమగ్రంగా స్పందించారు.

**వెటర్నరీ సేవలపై చర్చ**
సభలో పలువురు సభ్యులు పశువుల ఆరోగ్యం, పాల ఉత్పత్తి తగ్గుదలపై తమ సమస్యలు వ్యక్తం చేయగా, వెటర్నరీ విభాగం వారు గ్రామాల్లో సేవల విస్తరణ, సకాలంలో వైద్యం అందించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. "ప్రతి గ్రామంలో వెటర్నరీ బాధ్యత వహించే వ్యక్తిని నియమించాలన్నది మా లక్ష్యం." అని అన్నారు.

**పాడి పాల వెనుక ఆదాయ వెలుగు మహిళల విజయయాత్ర**
ముల్కనూర్ సహకార సొసైటీ చైర్మన్ అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి మాట్లాడుతూ "డెయిరీ ప్రారంభంలో మహిళలతో నిర్వహణ సాధ్యమవుతుందా అన్న అనుమానాలు ఉన్నా, వారి పట్టుదలతో ఈ రోజు దేశవ్యాప్తంగా గుర్తింపు పొందే స్థాయికి చేరుకోవడం గర్వకారణం." అని అన్నారు. వ్యవసాయం, వ్యవసాయేతర ఆదాయ మార్గంగా డెయిరీ వ్యవస్థ స్థిరంగా నిలిచిందని, 20,000 మందికి పైగా కుటుంబాలకు ఆదాయం అందుతోందని తెలిపారు. అత్యధిక పాలు సరఫరా చేసిన సభ్యులు, సంఘాల అధ్యక్షులు ఘనంగా సన్మానితులయ్యారు.

**సంఘ వ్యాపార లాభం**
ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మొత్తం సంఘాలు 134.64 కోట్ల వ్యాపారం చేయగా మొత్తం వ్యాపారంలో మిగులు 0.99 శాతం వచ్చింది. గత సంవత్సరం సంఘాలు మొత్తం 112.84 కోట్ల వ్యాపారం చేయగా, మొత్తం వ్యాపారంలో మిగులు 0.97 వచ్చింది.

**పాలకవర్గం తీర్మానాలు**
ఈ మహాసభలో పాలకవర్గం పలు తీర్మానాలను ప్రవేశపెట్టింది. దహన సహాయం ₹5,000 నుండి ₹7,500, సాధారణ మరణ బీమా ₹25,000 నుండి ₹35,000, ప్రమాద బీమా ₹50,000 నుండి ₹75,000 వరకు పెంచారు. ఈ తీర్మానాలు సభ్యుల మద్దతుతో ఆమోదించారు.

**బ్యాంక్ ప్రతినిధుల భాగస్వామ్యం**
ముల్కలు మహిళా డెయిరీకి ఆర్థిక లావాదేవీలను ఎస్బిఐ, కెనరా బ్యాంకులు అందిస్తున్నాయి. ఎస్‌బీఐ, కెనరా బ్యాంక్ మేనేజర్లు, డెయిరీ పాలకవర్గ సభ్యులు, అనేక గ్రామాల మహిళా సభ్యులు పాల్గొన్నారు.



# నూతన కానిస్టేబుళ్లకు టెక్నాలజీ పై శిక్షణ

- కరీంనగర్ పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం ఐపీఎస్

**కరీంనగర్,తెలంగాణ చౌరస్తా:**
కరీంనగర్ పోలీస్ కమీషనరేట్ పరిధిలోని పోలీస్ స్టేషన్లలో కొత్తగా విధుల్లో చేరిన కానిస్టేబుళ్లకు టెక్నాలజీ వినియోగంపై దశలవారీగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం తెలిపారు.రెండవ బ్యాచ్ కోసం శిక్షణ ప్రారంభించినట్లు ఆయన తెలిపారు.కమీషనరేట్ కేంద్రంలోని ఐటీ కోర్ కార్యాలయంలో పోలీసులు ఉపయోగించే వివిధ సాఫ్ట్‌వేర్‌లు, అప్లికేషన్‌లు, సాంకేతిక పరిజ్ఞానంపై ఈ శిక్షణ కొనసాగుతుందని ఆయన వివరించారు.ఈ సందర్భంగా పోలీస్ కమీషనర్ మాట్లాడుతూ...కమీషనరేట్ వ్యాప్తంగా నూతన కానిస్టేబుళ్లకు ప్రాథమిక శిక్షణతో పాటు, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించడానికి టెక్నాలజీపై పట్టు సాధించేలా ఈ ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. ఈ వారం రోజుల శిక్షణలో భాగంగా, పిటిషన్ డ్రాఫ్టింగ్ నుండి ఛార్జిషీట్ దాఖలు వరకు గల విధానాలు, సీసీటీఎన్ఎస్ 2.0, పిటిషన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ లో ఈసమన్ల జారీ మరియు అమలు, టీఎస్‌కాప్, హెచ్ఆర్ఎంఎస్, ఈసాక్ష్య, టెక్ డాటం, ఐరాడ్ దర్పణ్ సీఈఐఆర్, సైబర్ క్రైమ్‌లో ఆర్థిక, ఆర్థికేతర నేరాల గురించి, సీడీఆర్ వంటి అన్ని రకాల సాఫ్ట్‌వేర్ అప్లికేషన్‌లపై సమగ్ర శిక్షణ ఉంటుందని ఆయన వివరించారు. నేరాల ఛేదనలో సాంకేతికతను సమర్థవంతంగా ఉపయోగించడం ద్వారా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించడానికి అవకాశం ఉంటుందని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో ఏసీపీలు జి. విజయ కుమార్, వేణుగోపాల్, ఇన్‌స్పెక్టర్ తిరుపతి ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు

# బీసీ ప్రజా సంఘం నియోజకవర్గ అధ్యక్షులుగా నరేష్

**పెద్దపల్లి, తెలంగాణ చౌరస్తా :**
తెలంగాణ బీసీ ప్రజా సంఘం పెద్దపెల్లి జిల్లా రామగుండం నియోజకవర్గ అధ్యక్షులుగా గోదావరిఖని కి చెందిన పోలవేణి నరేష్ ని నియమించిన తెలంగాణ బీసీ ప్రజా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాయిని భరత్.వరంగల్ లో జరిగిన బీసీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో నియమించినట్లు నాయిని భరత్ నియామక పత్రం అందజేశారు.ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ.... బడుగు బలహీన వర్గాల ప్రజలు బీసీల హక్కుల పోరాటాల కోసం నా



వంతు కృషి చేస్తానని అన్నారు.ఈ పదవి రావడానికి సహకరించిన బీసీ నాయకులు అందరికీ ధన్యవాదాలు తెలియజేశారు



# సబ్బండ వర్గాల సంక్షేమమే లక్ష్యం

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- రామచంద్రపురం ఎస్సీ కాలనీలో కమ్యూనిటీ హాల్ ప్రారంభోత్సవం
- భవన నిర్మాణానికి రూ.45 లక్షల ఎమ్మెల్యే సొంత నిధులు

**పటాన్ చెరు, తెలంగాణ చౌరస్తా:**
పటాన్ చెరు నియోజకవర్గ పరిధిలోని సబ్బండవర్గాల సంక్షేమం, ఆర్థిక అభ్యున్నతి లక్షంగా పనిచేస్తున్నామని స్థానిక శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని ఎస్సీ కాలనీలో ఒక కోటి 30 లక్షల రూపాయలు నిధులతో నూతనంగా నిర్మించిన కమ్యూనిటీ హాల్ ను సోమవారం ఎమ్మెల్యే జిఎంఆర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందించిన నిధులతో పాటు 45 లక్షల రూపాయల సొంత నిధులను హాల్ నిర్మాణానికి కేటాయించినట్లు తెలిపారు. బడుగు బలహీన వర్గాలు ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందినప్పుడే సమానత్వం సిద్ధిస్తుందని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలలో అర్హులందరికీ ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ సహకారంతో పాటు నియోజకవర్గంలోని వివిధ పరిశ్రమల సిఎస్ఆర్ నిధులతో ప్రతి గ్రామాన్ని, పట్టణాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకుని వెళుతున్నామని తెలిపారు. అభివృద్ధిలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ అంజిరెడ్డి, స్థానిక కార్పొరేటర్ పుష్ప నగేష్, పరమేష్ యాదవ్, వివిధ దళిత సంఘాల ప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు



# టాటా బిల్డింగ్ ఇండియా ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు

**హుజూరాబాద్, తెలంగాణ చౌరస్తా:**
భారతీయ ప్రతిష్టాత్మక దిగ్గజ సంస్థ టాటా వారి టాటా బిల్డింగ్ ఇండియా ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సింగపూర్ మం. హుజూరాబాద్ నందు సోమవారం విద్యార్థినీ విద్యార్థులకు వ్యాస రచన పోటీ నిర్వహించారు.ఈ పోటీలో జూనియర్స్, సీనియర్స్ విభాగంలో 6 గురు విద్యార్థులను ఎంపిక చేశారు. సీనియర్స్ విభాగంలో మొదటి స్థానం గుండవేని తిరుమల,రెండవ,స్వర్గం తేజస్విని,మూడవ,మిడిదొడ్డి శ్రీవల్లి, జూనియర్స్ విభాగంలో మొదటి స్థానం జోంగోని పూజిత,రెండవ,తిప్పారపు ద్రాక్ష తాయి, మూడవ,ఓల్లాల సాయి తేజ గెలుపొందిన విద్యార్థుల కు ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారి భూపతి శ్రీనివాస్ చేతుల మీదుగా మెడల్స్, ప్రశంసా పత్రాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు,టిబి ఐ ఆర్గనైజర్ అంజలి,విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు

# నేడే రైతులకు వాతావరణ సూచనలపై వీడియో కాన్ఫరెన్స్

- కొత్తపల్లి రైతు వేదిక, రైతులు సద్వినియోగం చేసుకోవాలి

**భీమదేవరపల్లి తెలంగాణ చౌరస్తా :**
కొత్తపల్లిలోని రైతు వేదికలో మంగళవారం ఉదయం 10 గంటలకు "రైతు నేస్తం" పేరుతో రైతులకు వాతావరణ ఆధారిత సూచనలపై ప్రత్యేక వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించ బడుతుంది. ఈ కార్యక్రమంలో రైతులు వాతావరణ మార్పులకు అనుగుణంగా పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మెరుగైన దిగుబడుల కోసం అనుసరించాల్సిన పద్ధతులపై నిపుణుల నుండి సలహాలు, సూచనలు పొందవచ్చు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొని వాతావరణ సూచనలను సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ అధికారులు కమల్ హాసన్, క్రిజోలైట్ రైతులకు విజ్ఞప్తి చేశారు



# ప్రజావాణి అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలి

- అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్

**నారాయణపేట, తెలంగాణచౌరస్తా:**
ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే ఫిర్యాదులకు ప్రాధాన్యత నిస్తూ వెంటవెంటనే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ అధికారులను ఆదేశించారు. ప్రజావాణి సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను అదనపు కలెక్టర్ కు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు.కాగా, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని అదనపు కలెక్టర్ అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు,తదితరులు పాల్గొన్నారు

# ఇకపై కంప్లైంట్స్ రిజిస్టర్ చేయండి

**మద్దూర్ , తెలంగాణ చౌరస్తా:**
జిల్లాలో కొత్తగా ఏర్పడిన మున్సిపాలిటీ మద్దూర్ లో గ్రీవెన్స్ కంప్లైంట్స్ కొరకు స్పెషల్ కౌంటర్ ఏర్పాటు చేయడం జరిగింది. అందుకుగాను ఫోన్ నెంబర్ 9390540454 గల నెంబర్ కు ఎలాంటి కంప్లైంట్స్ ఉన్న ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు అందుబాటులో ఉంటుంది. కావున ప్రజలు ఈ నెంబర్కు కాల్ చేసి మీ యొక్క కంప్లైంట్స్ రిజిస్టర్



చేయగలరని మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్ తెలిపారు



# పూర్తయిన ఇంటర్ లాకింగ్ పనులు

**పెద్దపల్లి, తెలంగాణ చౌరస్తా:**

పెద్దపల్లి రైల్వే జంక్షన్ సమీపంలో నిర్మిస్తున్న బైపాస్ రైలు మార్గంలో గత నాలుగు రోజుల నుండి చేపడుతున్న ఇంటర్ లాకింగ్ పనులు పూర్తయ్యాయి. గత నాలుగు రోజుల నుండి రైళ్ల రాకపోకలు నిలిపివేయడంతో, ఆదివారం రైల్వే పనులు పూర్తి కావడంతో, సోమవారం ఉదయం నుండి అన్ని రైలు యథావిధిగా నడుస్తాయని రైల్వే అధికారులు తెలిపారు. దీంతో సోమవారం భాగ్యనగర్, ఇంటర్ సిటీ, కాగజ్ నగర్ ఎక్స్ ప్రెస్, సూపర్ ఫాస్ట్ ఎక్స్ ప్రెస్ రైళ్లు, సింగరేణి, రామగిరి, కరీంనగర్ పుష్పుల్ ఎక్స్ ప్రెస్, బల్లర్షా నుండి కాజీపేట వెళ్లే రైళ్ళాన్ని నడిచాయి. పెద్దపల్లి బైపాస్ వద్ద నిజామాబాద్ రైలు మార్గాన్ని నేరుగా కాజీపేట రైలు మార్గంతో అనుసంధానం చేయనున్నారు. నాలుగు రోజులపాటు రైళ్ల రాకపోకల రద్దుతో ఇబ్బందులు ఎదుర్కొన్న ప్రయాణికులు, మళ్లీ సోమవారం రైళ్లు రాకపోకలు ప్రారంభం అవడంతో ఊపిరి పీల్చుకున్నారు

# కోటకొండ మల్లెలోని చెరువు అలుగు పనులు పునర్నిర్మాణం చేపట్టాలి



**నారాయణపేట, తెలంగాణ చౌరస్తా:**

నారాయణపేట జిల్లా కేంద్రంలో కలెక్టర్ ఆఫీసులో ఏవో సుధారాణి ,ఇరిగేషన్ AE సాయికుమార్ కి మల్లెలోని చెరువు అలుగు పునర్నిర్మానం పనులు వెంటనే చేపట్టాలని వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐయుకేఎస్ జిల్లా కార్యదర్శి బి యాదగిరి మాట్లాడుతూ గతంలో అధిక వర్షాలు కుర్చడం వలన ఇరిగేషన్ రెవెన్యూ అధికారుల ఆదేశాల మేరకు అలుగును తొలగించారు. ఈ అలుగు తొలగించడంతో చెరువులోని నీరు మొత్తం కూడా బయటికి పోవడం జరిగింది ఈ అలుగు పనులు చేపట్టకపోవడంతో ఇప్పుడు కురుస్తున్న వర్షాలకు నీరు చెరువులోకి వెళ్లి బయటకు పోవడం జరుగుతుంది కాబట్టి వెంటనే ఈ అలుగు పనులు చేపట్టాలని ఆయకట్టు దారులు రైతులు కోరారు. గతంలో కూడా ఈ విషయంపై జిల్లా కలెక్టర్ ని కలవడం జరిగింది. ఈ పనులు వెంబడిచే పడతామని హామీ కూడా ఇవ్వడం జరిగింది ఇప్పటివరకు పనులు చేపట్టలేదు ఈ పనులు వెంటనే చేపట్టాలని ఇరిగేషన్ అధికారులకు కూడా విన్నవించిన పెడచెవిన పెడుతున్నారు ఈ పనులు చేపట్టనియెడల మా సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహిస్తామని అన్నారు.ఈ కార్యక్రమంలో టియుసిఐ జిల్లా ఉపాధ్యక్షులు బి నరసింహ, ఏఐపీకేఎంఎస్ జిల్లా ఉపాధ్యక్షులు వెంకట్ రాములు, ఏఐయుకేఎస్ జిల్లా సహాయ కార్యదర్శి ఏ రాములు, ఆయకట్టుదారులు దస్తప్ప, రఘు, గుండెగరి లక్ష్మయ్య, వెంకటేష్, నర్సిములు, రాములు, బాలు, జెట్టి అంజి, మార్కండీ, ఎం శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

# విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షురాలిగా బందిగి సురేఖ

**నారాయణపేట, తెలంగాణ చౌరస్తా:**

విశ్వహిందూ పరిషత్ నారాయణపేట జిల్లా అధ్యక్షురాలిగా బందిగి సురేఖ రాంబాబు ఏకగ్రీవంగా నియమితులయ్యారు.ఈ మధ్యనే విశ్వహిందూ పరిషత్ నారాయణపేట జిల్లా అధ్యక్షులు డాక్టర్ రాంబాబు ఆకస్మిక మరణం చెందిన విషయం తెలిసినదే. ఆయన మరణం తర్వాత కూడా డాక్టర్ రాంబాబు సతీమణి సురేఖ విశ్వహిందూ పరిషత్ కార్యక్రమాల్లో పాల్గొంటూ వస్తున్నారు.డాక్టర్ రాంబాబు సైతం సుమారు నాలుగు నెలల పాటు చురుకుగా విశ్వహిందూ పరిషత్ కార్యక్రమాలను నిర్వహించి జిల్లాలో మంచి పేరును తెచ్చుకున్నారు.ఈ మేరకు ఆయన స్థానంలో డాక్టర్ రాంబాబు సతీమణి సురేఖ రాంబాబును జిల్లా అధ్యక్షురాలిగా ప్రకటిస్తూ యాదగిరిగుట్టలో జరిగిన రాష్ట్ర ప్రాంత విశ్వహిందూ పరిషత్ సమావేశంలో పెద్దలు నిర్ణయం తీసుకున్నారు.తన భర్త ఆశయ సాధన కోసం కృషి చేస్తానని, నారాయణపేట జిల్లాలో విశ్వహిందూ పరిషత్ ఉన్నతికి, హిందూ ధర్మరక్షణ కోసం పాటు పడతానని ఈ సందర్భంగా నూతన అధ్యక్షురాలు తెలిపారు





# భానూర్ నుంచి శబరిమలకు మహా పాదయాత్ర

**పటాన్ చెరు, తెలంగాణ చౌరస్తా:**

భానూర్ గ్రామం నుండి శబరిమలకు భానూర్ గ్రామానికి చెందిన శాలివాహన నరేందర్ కాలినడకన బయలు దేరారు. ముందుగా ఆయన పాదయాత్ర తిరుమల చేరుకుని, తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి దర్శనం అనంతరం శబరిమల వరకు కొనసాగనుంది. మహా పాదయాత్ర సందర్భంగా సోమవారం ఇరుముడి, అయ్యప్ప స్వామివారి ఊరేగింపు కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధా శ్రీనివాస్ గౌడ్ కార్యక్రమానికి హాజరై స్వామివారిని నరేందర్ ను ఘనంగా సన్మానించారు. ఆధ్యాత్మికతకు నిదర్శనంగా సాగుతున్న ఈ మహా పాదయాత్ర విజయవంతంగా పూర్తి కావాలని ఆమె ఆకాంక్షించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గడ్డం శ్రీశైలం, శివానందం, సుధాకర్ గౌడ్, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.



# ఫీజు రియంబర్స్మెంట్ స్కాలర్షిప్స్ విడుదల చేయాలి

- పిడిఎస్ యు ఆధ్వర్యంలో సభ్యత్వం నమోదు.
- పిడిఎస్ యు గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి కే.శ్రీనివాస్, ఉపాధ్యక్షులు గడ్డం గౌతమ్

**తెలంగాణ చౌరస్తా, హైద్రాబాద్:**

పిడిఎస్ యు గ్రేటర్ హైదరాబాద్ కార్యవర్గం ఆధ్వర్యంలో సభ్యత్వం నమోదు కార్యక్రమాన్ని ఖైరతాబాద్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ప్రారంభించారు. ఈ సందర్భంగా పిడిఎస్ యు గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి కే శ్రీనివాస్, ఉపాధ్యక్షులు గడ్డం గౌతమ్ లు మాట్లాడుతూ కొత్త సీసాలో పాత సారా లాగే కాంగ్రెస్ ప్రభుత్వం తీరు ఉందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం మంటూ ప్రగల్భాలు పలికిన రేవంత్ రెడ్డి నేటికి విద్యార్థులకు ఫీజు రియంబర్స్మెంట్ స్కాలర్షిప్స్ విడుదల చేయలేదని తెలిపారు. పిడిఎస్ యు ఆవిర్భవించిన నాటి నుంచి నేటి వరకు గత 53 సంవత్సరాలుగా విద్యారంగ సమస్యల పరిష్కారానికై అవిరామంగా పోరాటం చేస్తున్నట్లు పేర్కొన్నారు. జార్జిరెడ్డి కలలు కన్నా శాస్త్రీయ విద్యా సాధనకై విద్యార్థిని, విద్యార్థులు పీడిఎస్ యు లో భాగస్వామ్యం పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శ్రీమన్నారాయణ,గణేష్, మహేష్, సతీష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ జూనియర్ కళాశాలకు నూతన బిల్డింగ్ నిర్మాణం చేయాలి

– పిడిఎస్ యు జిల్లా అధ్యక్షుడు ఎస్.సాయికుమార్



**నారాయణపేట,తెలంగాణ చౌరస్తా:**

ప్రభుత్వ జూనియర్ కళాశాల, పాత బిల్డింగ్ ను కూల్చి,నూతన బిల్డింగ్ నిర్మాణం చేయాలి. మూత్రశాలలో, మరుగుదొడ్లు నిర్మాణం చేయాలని (పి.డి.ఎస్ యు) జిల్లా అధ్యక్షుడు ఎస్. సాయికుమార్ అన్నారు. నారాయణపేట జిల్లా కేంద్రంలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల పాత బిల్డింగ్ ను కూల్చివేయాలని,శిథిల వ్యవస్థలో ఉన్న మూత్రశాలలో,మరుగుదొడ్లు త్వరగా పూర్తి చేయాలని స్థానిక ఎమ్మెల్యే చిట్టెం పర్ణిక రెడ్డికి. పిడిఎస్ యు ఆధ్వర్యంలో వినతిపత్రం ఇవ్వడం జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొన్ని దశాబ్దాలుగా నారాయణపేట జిల్లా కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల కొనసాగుతున్నది.ఆ బిల్డింగ్ పాతది కావడంతో కొన్ని క్లాస్ రూమ్స్ పెచ్చులు ఉడిపోవడంతో,నూతనంగా గత మూడు సంవత్సరాల కింద కొత్తగా కొన్ని క్లాస్ రూములను నిర్మాణం చేశారు.కానీ ఇప్పటికి కొన్ని క్లాసులు ఆ పాత బిల్డింగ్ లోనే కొనసాగుతున్నాయి.ఈ పాత బిల్డింగ్ ని పడగొట్టాలని గతంలో స్థానిక ఎమ్మెల్యేకు మరియు జిల్లా కలెక్టర్ కు రాతపూర్వకంగా వినతిపత్రం కూడా ఇవ్వడం జరిగింది.దానికి అమౌంట్ కూడా శాంక్షన్ అయినవని చెప్పారు.కానీ నేటికీ వరకు స్టార్ట్ కాలేదు. విస్తృతంగా అకాల వర్షాలు కురుస్తుండడంతో కళాశాల ప్రాంగణంలో విద్యార్థులు తిరిగే సమయంలో గోడలు కూలితే విద్యార్థులకు ప్రమాదం జరిగే అవకాశం ఉన్నది. ఇప్పటికే కొన్ని క్లాస్ రూమ్ లో పై పెచ్చులూడి పడుతున్న పరిస్థితి ఉన్నది. మొన్న కాల వర్షాలకు రాజస్థాన్ రాష్ట్రంలో స్కూల్ పాత బిల్డింగ్ కూలి ఏడు మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారు.30 మందికి పైగా గాయాల పాలైన పరిస్థితి ఉన్నది.తక్షణమే స్పందించి ఆ పాత బిల్డింగ్ ను కూల్చివేయడానికి పనులు ప్రారంభించే రకంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఆ కళాశాలలో దాదాపు 500 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తుంటారు. కానీ వాళ్లకు తగిన మూత్రశాలలు, మరుగుదొడ్లు లేవు. గర్ల్స్ కు మూడు ఉన్న అవి కూడా , శిథిలావస్థ లో ఉన్నాయి. బాయ్స్ కు అసలే లేని పరిస్థితి ఉన్నది.దీనితో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న పరిస్థితి ఉన్నది.విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా, మూత్రశాలను, మరుగుదొడ్లు పూర్తి చేయాలని,కళాశాల పాత బిల్డింగ్ ను వెంటనే కూల్చాలని స్థానిక ఎమ్మెల్యేకి వివరించడం జరిగింది.స్పందించిన ఎమ్మెల్యే పర్ణిక రెడ్డి , వెంటనే పనులు ప్రారంభించాలని ఉన్నత అధికారులతో ఫోన్లో మాట్లాడుతూ ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పి.డి. ఎస్.యు జిల్లా సహకార్యదర్శి వెంకటేష్ ,జిల్లా కోశాధికారి మహేష్ ,నాయకులు సురేష్ పి.డి.ఎస్.యు బృందం పాల్గొన్నారు.



# శివాలయంలో శ్రావణమాసం ప్రత్యేక పూజలు

- కోరిన కోర్కెలు తీర్చే కొండంత దైవం పశుపతినాథుడు
- శ్రావణప్రథమ సోమవారం ప్రత్యేక పూజలు
- ఆలయ అర్చకులు శ్రీ సదానిరంజన్ సిద్ధాంతి.

**ఎల్కతుర్తి,తెలంగాణ చౌరస్తా:**

ఎల్కతుర్తి మండలం వల్లభాపురం గ్రామం శ్రీ పశుపతినాథ్ దేవాలయంలో సోమవారం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం శ్రావణమాసం ప్రథమ సోమవారం నాగచతుర్థి పర్వదినాన్ని పురస్కరించుకొని దేవాలయంలో ప్రత్యేక పూజలలో కళాశగనాధిపతి పూజ, స్వామికి పంచామృత సహిత రుద్రాభిషేకం, అష్టోత్తరబిల్వార్చన, సాముహిక అర్చనలు నిర్వహించామని ఆలయ అర్చకులు ధూప దీప నైవేద్య అర్చక సంఘం మండల అధ్యక్షులు శ్రీ సదానిరంజన్ సిద్ధాంతి తెలియజేశారు. వల్భాపూర్ ,చుట్టూ పక్కన గ్రామాలలోని ప్రజలు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి మొక్కలు చెల్లించుకున్నారు. తదనంతరము ఆలయమునకు వచ్చిన భక్తులందరికీ తీర్థ ప్రసాద వితరణ చేసి వేదఆశీర్వచనాలు అందించారు. ఆలయ అర్చకులు శ్రీ సదానిరంజన్ సిద్ధాంతి ఆలయ కమిటీ చైర్మన్ గంజి భావన ఋషి, సభ్యులు రామారావు, సంపత్ రావు, విజయ్, యాదగిరి,కరుణాకర్, రమణకాంత్, రామకృష్ణ, దశ్రూ,మహేందర్, విజయశ్రీ, రమాదేవి,మంజుల, కావ్య , స్వాతి, వాణి, సరోజన భక్తులు గ్రామస్తులు పాల్గొన్నారు.



# మా కుమార్తె పెళ్లికి రండి..

– ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డిని ఆహ్వానించిన నిర్మల జగ్గారెడ్డి

**పటాన్ చెరు, తెలంగాణ చౌరస్తా:**

ఆగస్టు 7వ తేదీన సంగారెడ్డి లోని రామ మందిరంలో నిర్వహించనున్న తమ కుమార్తె వివాహానికి హాజరుకావాలని కోరుతూ పటాన్ చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే తూర్పు జయప్రకాశ్ రెడ్డి ఆహ్వానించారు. ఈ మేరకు సోమవారం సాయంత్రం పటాన్ చెరులోని క్యాంపు కార్యాలయంలో జగ్గారెడ్డి సతీమణి నిర్మల జయప్రకాశ్ రెడ్డి ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డిని కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు.



# భూ సేకరణకు వ్యతిరేకంగా కదం తొక్కిన రైతన్నలు

**నారాయణపేట, తెలంగాణ చౌరస్తా:**

నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకం కోసం చేపట్టిన భూ సేకరణ కు వ్యతిరేకంగా భూ నిర్వాసితులు నిరసిస్తూ,కదం తొక్కారు.వారం రోజుల నుండి మున్సిపల్ పార్క్ వద్ద రిలే నిరాహార దీక్షలు చేపట్టిన రైతులు సోమవారం పట్టణ ప్రధాన రహదారుల గుండా భారీ నిరసన ర్యాలీ తీశారు.ముందు జాగ్రత్తగా పోలీసులు ఈ ర్యాలీ కోసం పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.భూ పరిహారం కేటాయింపునకు ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.





# ఫెన్సింగ్ ఏరియా బాధితులకు న్యాయం చేయండి

- 218 కుటుంబాలకు కొల్లూరులోని 'డబుల్' ఇండ్లు కేటాయించండి
- భారతినగర్ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి
- మాజీ మంత్రి హరీష్ రావుతో కలిసి
- అడిషనల్ కలెక్టర్‌కు వినతి

**పటాన్ చెరు, తెలంగాణ చౌరస్తా:** భారతి నగర్ డివిజన్ పరిధిలోని ఇక్రిశాట్ ఫెన్సింగ్ ప్రాంతంలో ఎంఎంటీఎస్ రైల్వే లైన్ నిర్మాణం నేపథ్యంలో నివాస గృహాలను కోల్పోయిన బాధితులకు పునరావసం కల్పించాలని భారతి నగర్ కార్పొరేటర్ సింధు ఆదర్శ రెడ్డి కోరారు. సుమారు 218 కుటుంబాలు ఇప్పటికీ పునరావాసం కోసం ఎదురుచూస్తున్నారని వారికి న్యాయం చేయాలని కోరుతూ సోమవారం మాజీ మంత్రి హరీష్ రావు, పటాన్ చెరు నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ కోఆర్డినేటర్ ఆదర్శ్ రెడ్డి, జిల్లా ఎమ్మెల్యేలతో కలసి ఆమె జిల్లా అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్ కు వినతిపత్రం అందజేశారు. బాధిత కుటుంబాలతో కలిసి కలెక్టర్ కార్యాలయాన్ని సందర్శించి, అప్పట్లో రెవెన్యూ అధికారుల ద్వారా అందించిన హామీ పత్రాలను కార్పొరేటర్ సింధు అడిషనల్ కలెక్టర్ కు చూపించారు. బాధితులందరికీ
తక్షణమే కొల్లూరు డబుల్ బెడ్రూం ఇళ్లలో పునరావాసం కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ఇతర ప్రాంతాల నిర్వాసితులకు ఇళ్లను కేటాయించారని, కానీ ఈ ప్రాంతంలోని 218 కుటుంబాలకు మాత్రం ఇప్పటికీ కేటాయించకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే నివాస హక్కులు కల్పించి, బాధితులకు న్యాయం చేయాలని ఆమె జిల్లా యంత్రాంగాన్ని విజ్ఞప్తి చేశారు.

# మంత్రి పొన్నం ప్రభాకర్ కు కృతజ్ఞతలు



**ఎల్కతుర్తి, తెలంగాణ చౌరస్తా :** ఎల్కతుర్తి మండల కేంద్రంలో టిఆర్ఆర్ఎస్ హన్మకొండ జిల్లా అధ్యక్షులు హింగే భాస్కర్ మాట్లాడుతూ గతంలో ఎల్కతుర్తి హుజురాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీకి అనుబంధ మండలంగా ఉండేది ఇప్పుడు భీమదేవరపల్లి ఎల్కతుర్తి రెండు మండలాలను నూతన వ్యవసాయ మార్కెట్ కమిటీగా ఎల్కతుర్తిని మంజూరు చేస్తూ జీవో జారీ చేసినందుకు మంత్రి పొన్నం ప్రభాకర్ కి రైతుల పక్షాన కృతజ్ఞతలు తెలిపారు. వ్యవసాయ మార్కెట్ హుజరాబాద్ లో ఉన్నందున మునుపు రైతులు ఇబ్బంది పడేవారని ఇకపై రైతులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పండించిన పంటను ఎల్కతుర్తి మార్కెట్లో తరలించవచ్చని తెలిపారు. రైతులకు ఎలాంటి సమస్యలు ఉన్న రైతుల పక్షాన పోరాడుతామని తెలిపారు.

# కరీంనగర్ త్రీ టౌన్, కిసాన్ నగర్ లో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్



**కరీంనగర్, తెలంగాణ చౌరస్తా:** కరీంనగర్ పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం ఐపీఎస్ ఆదేశాల మేరకు త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కిసాన్ నగర్‌లో ఈరోజు కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు.ఈ ఆపరేషన్‌లో పలు అంశాలపై తనిఖీలు కొనసాగినవన్నారు. పాత నేరస్థులు అద్దెకు ఇల్లు తీసుకుని నివసిస్తున్నారా అని ఆరాదీశారు.సరైన ధృవపత్రాలు లేని 71 వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.వీటిలో 64 బైకులు, 5 ఆటోలు, ఒక ట్రాలీ ఆటో, ఒక కారు ఉన్నాయి.ఈ సందర్భంగా పోలీస్ అధికారులు స్థానిక ప్రజలకు పలు అంశాల పై అవగాహన కల్పించారు.సైబర్ నేరాలు జరుగుతున్న తీరును వివరించి ,సైబర్ నేరానికి గురైనట్లయితే వెంటనే స్పందించి,నేరం జరిగిన గంట లోపల 1930 నంబర్‌కు ఫోన్ చేయడం ద్వారా తస్కరించబడిన సొమ్మును ఫ్రీజ్ చేసి తిరిగి పొందవచ్చని తెలిపారు.మాదక ద్రవ్యాలను దుర్వినియోగం చేయడం, వాటిని అక్రమంగా రవాణా చేయడం, అమ్మకం, వినియోగించడం చట్ట ప్రకారం నేరం అని పోలీసులు స్పష్టం చేశారు. అంతేకాకుండా వాటి వలన కలిగే దుష్పరిణామాల పై స్థానికులకు అవగాహన కల్పించారు.చట్ట వ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని కమీషనర్ గౌష్ ఆలం హెచ్చరించారు.శాంతి భద్రతలకు విఘాతం కల్పించే వ్యక్తుల పై సమాచారం అందించాలని ప్రజలను కోరారు.చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై ఏదైనా సమాచారం ఉంటే డయల్ 100 ద్వారా లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.ఈ ఆపరేషన్ ద్వారా కిసాన్ నగర్‌లో శాంతి భద్రతలను పటిష్టం చేయడమే కాకుండా, ప్రజలలో నేరాల పట్ల అవగాహన కల్పించినట్లు పోలీసులు తెలిపారు



# శంకర భారతి పేరిట ఉన్న భూములను రక్షించండి

**నారాయణపేట,తెలంగాణ చౌరస్తా:** నారాయణపేట మండలంలోని అంతారం, అయ్యవారిపల్లి, లింగంపల్లి మరియు కొల్లంపల్లి శివార్లలో ఉన్న హంపి పీఠం భూములపై దొంగ పట్టాలను అమలు చేయకండని నారాయణపేట తహసీల్దారుకు ప్రజావాణిలో దరఖాస్తు చేసిన భక్తజన మండలి శ్రీ విద్యా రంగ స్వామీజీ విరూపాక్ష విద్యారణ్య మఠం హంపి క్షేత్రం హోస్పేట తాలూకా బళ్లారి జిల్లా కర్ణాటక వారి భూములు తెలంగాణ వ్యాప్తంగా దాదాపు 2000 ఎకరాలు ""శంకర భారతి పేరిట"" ఉండి ఆయా శివారులలో స్థానిక రైతులు సాగు చేసుకుంటూ జీవిస్తున్నారు. హంపీ పీఠం మరియు పీఠాధిపతి ప్రత్యక్ష పరోక్ష పర్యవేక్షణ లేని కారణంగా ఈరోజు రాష్ట్ర ప్రభుత్వం వారి భూభారతి చట్టాన్ని ఆసరా చేసుకుని కొందరు రైతులు దొంగ సాదా బైనమాలను సృష్టించుకుని అక్రమ పట్టాలను చేసుకోవడానికి తెరలేపారు.కొందరు రెవెన్యూ అధికారులు వారితో కుమ్మక్కై పీఠానికి చెందిన భూములను అక్రమ పట్టాలు చేయడం వల్ల గతంలో మఠమందిరాల నిర్వహణకు ఇచ్చిన భూముల హక్కుదారుల లక్ష్యం నీరు గారి పోతుంది కావున హంపి పీఠానికి చెందిన శంకర భారతి పేరిట ఉన్న భూములను రక్షించాల్సిన బాధ్యత ఆయా మండల తహసీల్దారుల పైనే ఉన్నది కావున నారాయణపేట మండలంలో అంతారం, అయ్యవారి పల్లి, లింగంపల్లి, కొల్లంపల్లి తదితర గ్రామాలలో శంకర భారతి పేరిట ఉన్న భూములను గుర్తించి దొంగల పాలిట కాకుండా శ్రీ విద్యారణ్య స్వామీజీ శ్రీ విరుపాక్ష విద్యారణ మఠం హంపి పేరిట పట్టాదారు పాసుబుక్కులను మంజూరు చేయాలని మాట మందిర భక్తజన మండలి తరపున ఈరోజు నారాయణపేట తహసీల్దార్ కు ప్రజావాణి ద్వారా వినతి పత్రం ఇవ్వడం జరిగినది ఈ కార్యక్రమంలో మరియు కేంద్ర ప్రభుత్వ సహాయ న్యాయవాది రఘువీర్ యాదవ్ పాల్గొన్నారు.



# ఆపరేషన్ కగార్ ను నిలిపివేయాలని...

- ఆదివాసీల హక్కులను కాపాడాలి
- ఆగస్టు 2న జరిగే సదస్సును జయప్రదం చేయండి.
- ఆదివాసీల హక్కుల పోరాట సంఘీభావ వేదిక జిల్లా కన్వీనర్ ఎల్. భద్రయ్య,

**నూతనకల్ తెలంగాణ చౌరస్తా :** భారత రాజ్యాంగంలో కల్పించబడిన జీవించే హక్కును, భావ ప్రకటన స్వేచ్ఛలను మోడీ ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో హరించి వేస్తుందని, ఇది ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ఆదివాసీల హక్కుల పోరాట సంఘీభావ వేదిక జిల్లా కన్వీనర్ ఎల్. భద్రయ్య, ఉమ్మడి జిల్లా కో ఆర్డినేటర్ చింతరెడ్డి సుధాకర్ రెడ్డి అన్నారు. ఆదివాసీల హక్కులను కాపాడాలని, ఆపరేషన్ కగార్ ను నిలిపివేయాలని ఆగస్టు 2న నూతనకల్ మండల కేంద్రంలో సాయిరాం ఫంక్షన్ హాల్ లో జరిగే సదస్సును జయప్రదం చేయాలని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం రాజ్యాంగ బద్ధహక్కులను అమలు చేయకుండా వివక్షత పూరితంగా వివిధ వర్గ ప్రజలపై నిరంకుషత్వంగా వ్యవహరిస్తు అణిచివేస్తుందని అన్నారు. ప్రజల సంపదను, వనరులను క్రమక్రమంగా కార్పొరేట్, బహుళ జాతి కంపెనీలకు అప్పజెప్పడానికి కుట్రపూరితంగా ఆపరేషన్ కగార్ ను అమలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రజల హక్కులను కాపాడాల్సిన పాలకులు హరించడం అన్యాయం అన్నారు. తక్షణమే మావయసులపై ఆదివాసులపై యుద్ధాన్ని ఆపాలని వారితో శాంతి చర్చలు జరపాలని ఆగస్టు 2న జరిగే సదస్సులో పెద్ద ఎత్తున ప్రజలు, ప్రజాస్వామికవాదులు, విద్యార్థులు, మేధావులు, కార్మికుల పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్ టి యు జిల్లా ప్రధాన కార్యదర్శి గంట నాగయ్య, సిపిఎం మండల కార్యదర్శి కందాల శంకర్ రెడ్డి, సిపిఐ మండల కార్యదర్శి తోట్ల ప్రభాకర్, రైతు సంఘం నాయకులు మాధవరెడ్డి, సిపిఐ (ఎం.ఎల్) న్యూ డెమోక్రసీ డివిజన్ నాయకులు దేశోజు మధు, పి ఎస్ యు నాయకులు ఆవుల నాగరాజు, ఎం వెంకటరెడ్డి సిపిఐ నాయకులు బి. వెంకటేశ్వర్లు, డప్పు రామన్న తిరుమలేస్,గడ్డం శ్రీను, రవి, తదితరులు పాల్గొన్నారు.



# హలో బిసి విద్యార్థి_ఛలో ఢిల్లీ పోస్టర్ ఆవిష్కరణ

- ఆగస్టు 1న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ధర్నా
- కేంద్రం 42 శాతం బీసీ రిజర్వేషన్ బిల్లును ఆమోధించి 9వ షెడ్యూల్ లో చేర్చాలి

**సికింద్రాబాద్, తెలంగాణ చౌరస్తా:** త్వరలో జరగబోయే వర్షాకాల పార్లమెంట్ సమావేశాలలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు విద్యా, ఉద్యోగ,స్థానిక సంస్థలలో 42% రిజర్వేషన్లను ఆమోదిస్తూ తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఏకాభిప్రాయంతో రాష్ట్రపతికి పంపించిన తీర్మానాన్ని పార్లమెంట్ ఉభయ సభల ఆమోదంతో కోర్టు వివాదాలకు అవకాశం లేకుండా,న్యాయ సమీక్షకు దూరంగా ఉండేందుకు 9వ షెడ్యూల్లో చేర్చాలని డిమాండ్ చేస్తూ బీసీ స్టూడెంట్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు కొమ్మనబోయిన సైదులు యాదవ్ ఆధ్వర్యంలో ఉస్మానియా యూనివర్సిటీ నుండి ఆగస్టు 1న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిర్వహించనున్న ధర్నా కార్యక్రమం యొక్క పోస్టర్ ను సోమవార ఆర్ట్స్ కళాశాల వేదికగా బీసీ విద్యార్థులు, బహుజన విద్యార్థి సంఘాలు మరియు బీసీ ప్రొఫెసర్లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఇంటలెక్చువల్ ఫోరమ్ అధ్యక్షులు రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిరంజీవులు, ప్రొ. శ్రీనివాస్, ప్రొ.చల్లమాళ్ళ వెంకటేష్, ప్రొ. రాములు శఫర్దులు మాట్లాడుతూ.వర్షాకాల పార్లమెంట్ సమావేశాలలో 42 శాతం బీసీ రిజర్వేషన్ బిల్లును ఆమోధించి 9వ షెడ్యూల్ లో చేర్చాలని, బీసీ రిజర్వేషన్ నుంచి ముస్లింలను తీసివేయాలనే బీజేపీ పార్టీ వైఖరిని తప్పు పడుతూ 1971 లో అనంత రామన్ కమిషన్ ఆధ్వర్యంలో 6ముస్లిం ఉప కులాలను చేర్చిన విషయం మర్చిపోయారా అని వారు తెలిపారు. బీజేపీ ప్రభుత్వం ఈ సమావేశాలలో బిల్లును 9 షెడ్యూల్ లో పెట్టాలి అని డిమాండ్ చేశారు. లేకపోతే తెలంగాణ లోని మొత్తం బీసీలకు ద్రోహం చేసినవారవుతారని వారు తెలిపారు.రాజ్యాంగం ప్రకీయ తొరగా పూర్తి చేయాలనీ వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో IOBC అధ్యక్షులు వేణు అవారి, టి ఎస్వీ రాష్ట్ర అధ్యక్షులు భారీ అశోక్, తెలంగాణ బీసీ విద్యార్థి అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు లింగం యాదవ్ విజేఎస్ ఓయూ అధ్యక్షులు రమేష్ యాదవ్,BCSF నాయకులు గణేష్,, సురేష్,, అభిరామ్,శంకర్, కార్తీక్, సత్యం, శశి,నవీన్, సాదిక్,రఘు ,దినేష్, అభిలాష్ ,కొమరవెల్లి ,శరత్, అన్సార్ ,వినోద్, సాయి, వెంకటేష్, శ్రీనివాస్,గణేష్, మనోజ్, శివ తదితరులు పాల్గొన్నారు.



# సీజనల్ వ్యాధుల పైన అవగాహన కార్యక్రమం

**విద్యా నగర్, తెలంగాణ చౌరస్తా :** వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పైన అవగాహన కార్యక్రమం అడిక్మెట్ డివిజన్ పరిధిలోని విద్యానగర్ మజీద్ లైన్ లో స్థానిక ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.వర్షాల వల్ల వచ్చే అంటూ వ్యాధుల గురించి అదేవిధంగా మన పరిసర ప్రాంతాలలో నీరు నిలువ ఉండడం వలన ఆయా ప్రదేశాలలో దోమలు తయారీ వాటి ద్వారా డెంగ్యూ ,మలేరియా వంటి ప్రాణాంతకర వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని తెలిపారు. అందువల్ల మన చుట్టూ ఉన్న ప్రాంతాలలో నీరు నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండి తగు జాగ్రత్తలు తీసుకోవాలని స్థానిక ప్రజలకు తెలియజేశారు. అదేవిధంగా సీజనల్ వ్యాధుల నుండి ముఖ్యంగా పిల్లలు ,పెద్దలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఈ సీజనల్ వ్యాధుల నివారణకు ముందస్తు జాగ్రత్తగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో యూపీహెచ్ ఏ ఎం ఎస్ మెడికల్ అధికారి డా. కౌసర్, హరినివాస్ రెడ్డి,శ్యామల, రోజా, హెల్త్ ఏ ఏం ఓ హెచ్ ప్రవీణా,ఆశా వర్కర్ చంద్రకళ , శ్యామల, యుఎమ్మెస్ మలేరియా స్టాఫ్ రసూల్ బాషా , అజయ్ కుమార్, శ్రీనివాస్, సునీల్ కుమార్, బీఎస్ఎస్ అడికిమెట్ డివిజన్ ప్రధాన కార్యదర్శి సురేందర్, అనురాధ కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించండి

**హైదరాబాద్, తెలంగాణ చౌరస్తా:** తెలంగాణ నాన్‌గెజిటెడ్ ఆఫీసర్స్ (టీఎన్‌జీఓ) సెంట్రల్ యూనియన్, అధ్యక్షుడు మారమ్ జగదీష్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.ఎం. హుస్సేని (ముజీబ్) నేతృత్వంలో రాజీవ్ గాంధీ హన్మంతు ఐఏఎస్ తో సమావేశమై ప్రభుత్వ ఉద్యోగుల ముఖ్యమైన సమస్యలను చర్చించారు.యూనియన్, రిజిస్ట్రేషన్ శాఖ ఉద్యోగులకు కేటాయించిన ఎన్నికల విధులను రద్దు చేయాలని కోరుతూ ఒక వినతిపత్రాన్ని సమర్పించారు.ఈ విధులతో వారి ప్రాథమిక బాధ్యతలకు అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు.జూనియర్ అసిస్టెంట్స్, సీనియర్ అసిస్టెంట్స్ పదోన్నతులను త్వరగా పరిశీలించాలని, సకాలంలో వృత్తిపరమైన పురోగతి ఆవశ్యకతను నొక్కిచెప్పారు.అంతేకాకుండా, సస్పెండ్ చేయబడిన ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ప్రతినిధి బృందం కోరింది.రాజీవ్ గాంధీ హన్మంతు యూనియన్ విజ్ఞప్తుల పట్ల సానుకూలంగా స్పందించి,లేవనెత్తిన అన్ని విషయాలపై త్వరితగతిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ సమావేశంలో అసోసియేట్ ప్రెసిడెంట్ వెంకట్, కోశాధికారి సత్యనారాయణ గౌడ్, కార్యదర్శి కురాడి శ్రీనివాస్ పాల్గొన్నారు.




## కింగ్‌డమ్ మోతే

కెరీర్ ఆరంభంలో పెళ్ళిచూపులు, అర్జున్ రెడ్డి, గీత గోవిందం, ట్యాక్సీవాలా లాంటి సక్సెస్ ఫుల్ సినిమాలతో దూసుకెళ్లాడు విజయ్ దేవరకొండ. తక్కువ టైంలోనే అతను పెద్ద స్టార్‌గా ఎదిగిపోయాడు. కానీ తనపై అంచనాలు పెరిగాక వాటిని అందుకోవడంలో తడబడ్డాడు. వరల్డ్ ఫేమస్ లవర్, డియర్ కామ్రేడ్ లాంటి డిజాస్టర్లు అతణ్ని వెనక్కి లాగేశాయి. ఇక లైగర్, ఫ్యామిలీ స్టార్ చిత్రాలు కొట్టిన దెబ్బ అలాంటిలాంటిది కాదు. దీంతో విజయ్ ఫాలోయింగ్, మార్కెట్ బాగా డౌన్ అయిన సంకేతాలు కనిపించాయి.ఇలాంటి టైంలో అతను 'జెర్సీ' దర్శకుడు గౌతమ్ తిన్ననూరితో 'కింగ్‌డమ్' చేశాడు. ఐతే మేకింగ్ దశలో ఉండగా దీనికి హైప్ తక్కువగానే కనిపించింది కానీ.. రిలీజ్ టైంకి అంతా మారిపోయింది. క్రేజీ టీజర్, ట్రైలర్, పాటలు సినిమాకు కావాల్సిన హైప్ తీసుకొచ్చేశాయి. ముఖ్యంగా లేటెస్ట్‌గా వచ్చిన ట్రైలర్ వేరే లెవెల్ అనిపించింది. దీంతో సినిమా ఫుల్ పాజిటివ్ బజ్ మధ్య రిలీజ్ కాబోతోంది. బాక్సాఫీస్ దగ్గర కూడా 'కింగ్‌డమ్'కు అనుకూల పరిస్థితులే కనిపిస్తున్నాయి. డివైడ్ టాక్ తెచ్చుకున్న 'హరిహర వీరమల్లు' రెండో వీకెండ్లో బలంగా నిలబడడం కష్టమే. విజయ్ సినిమాకు థియేటర్ల సమస్య కూడా లేదు. పెద్ద రిలీజ్ ఉండబోతోంది. కావాల్సిందల్లా మంచి టాకే. విజయ్ గత చిత్రాలు తన జడ్జిమెంట్‌ను ప్రశ్నార్థకం చేసినప్పటికీ.. గౌతమ్ తిన్ననూరి అంటే ఆషామాషీగా సినిమా తీయడని, అతణ్ని నమ్మి సినిమాకు వెళ్లొచ్చనే భరోసా ప్రేక్షకుల్లో కనిపిస్తోంది. నిర్మాత నాగవంశీ కూడా వరుస విజయాలతో తనకంటూ ఒక క్రెడిబిలిటీ తెచ్చుకున్నాడు. అతను విజయ్ మార్కెట్‌కు మించి సినిమా మీద భారీగా ఖర్చు పెట్టాడు. సినిమా మీద అతను చాలా కాన్ఫిడెంట్‌గా ఉన్నాడు. సినిమాకు పాజిటివ్ టాక్ వస్తే ఓపెనింగ్స్ ఊహించని స్థాయిలో ఉంటాయని భావిస్తున్నారు. ఫైనల్ రిజల్ట్ కూడా గొప్పగా ఉండొచ్చని.. విజయ్ కెరీర్లో ఇది బిగ్గెస్ట్ హిట్‌గా మారే అవకాశాలు కూడా ఉన్నాయని ట్రేడ్ పండిట్లు అంచనా వేస్తున్నారు.

## మరోసారి అనసూయపై ట్రోల్స్..

బుల్లితెర యాంకర్ గా కెరీర్ ను మొదలుపెట్టి ఆ తర్వాత నటిగా మారి తనకంటూ మంచి గుర్తింపు తెచ్చుకున్నారు అనసూయ భరద్వాజ్. అనసూయ అంటే తెలుగు రాష్ట్రాల్లో తెలియని వారుండరంటే అతిశయోక్తి కాదు. అటు బుల్లితెరపై, ఇటు వెండితెరపై సంచనాలు క్రియేట్ చేస్తున్న అనసూయపై సోషల్ మీడియాలో భారీగా నెగిటివిటీ వస్తూ ఉంటుంది. గతంలో ఆమె విజయ్ దేవరకొండపై చేసిన పోస్ట్ ఎంతటి వివాదమైందో తెలిసిందే. యాంకరింగ్, యాక్టింగ్ లో బిజీగా ఉన్న అనసూయ ఎప్పుడూ ఆడియన్స్ దృష్టిని ఆకట్టుకుంటూనే ఉంటారు. జబర్దస్త్ షో తో బాగా ఫేమస్ అయిన అనసూయ బుల్లితెరకు గ్లామర్ ను పరిచయం చేశారు. ఆ తర్వాత క్షణం, రంగస్థలం, పుష్ప, పుష్ప2 సినిమాల్లో నటించి నటిగా తనదైన ముద్ర వేసుకున్నారు. రీసెంట్ గా కిర్రాక్ బాయ్స్, ఖిలాడీ గర్ల్స్ లాంటి షో ల తో బుల్లితెరకు రీఎంట్రీ ఇచ్చిన అనసూయ తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొని తన విషయంలో వచ్చే నెగిటివిటీ, ట్రోలింగ్స్ పై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉండే తన పోస్టులకు ఎవరైనా అభ్యంతరకరంగా కామెంట్ చేస్తే వెంటనే బ్లాక్ చేస్తానని, ఇప్పటివరకు తాను సుమారు 30 లక్షల మందిని బ్లాక్ చేసి ఉంటానని చెప్పారు. రియాక్ట్ అయ్యి అయ్యి ఇక భరించలేకపోయానని, అందుకే ఇక నా ప్రపంచంలో నువ్వు లేవు, నా లైఫ్ లో ఇక నువ్వు లేవనుకుని బ్లాక్ చేశానంటూ అనసూయ చెప్పారు. అనసూయ చేసిన ఆ కామెంట్స్ ప్రస్తుతం నెట్టింట వైరల్ అవుతున్నాయి. అయితే ఆమె వ్యాఖ్యలను పోస్ట్ చేస్తూ నెటిజన్లు దాన్ని కూడా ట్రోల్ చేస్తున్నారు. అనసూయకు సోషల్ మీడియాలో ఉన్న ఫాలోవర్లు కేవలం 20 లక్షలు మాత్రమే అయినప్పుడు తానెలా 30 లక్షల మందిని బ్లాక్ చేసిందంటూ కామెంట్స్ చేస్తుంటే మరికొందరైతే నువ్వింకా ఆ స్టేజ్ కు రాలేదని కామెంట్స్ చేస్తున్నారు. చాలా మందిని బ్లాక్ చేశానని కాకుండా పర్టిక్యులర్ గా నెంబర్ చెప్పి మరోసారి ట్రోల్ అవాల్సిన పనేముందని అంటున్నారు. కాగా ఈ ట్రోల్స్ ఇంటర్వ్యూ చేసిన వ్యక్తి రెస్పాండ్ అవుతూ, ఇతరులపై కామెంట్ చేయడం చాలా ఈజీగానే ఉంటుంది. కానీ ఒక్కసారి ఆమె వైపు నుంచి కూడా ఆలోచించాలని, ఆమె చెప్పిన నెంబర్ నిజం కాకపోయినా ఆమె ఎదుర్కొంటున్న నెగిటివిటీ మాత్రం నిజమేనని, కనీసం ఆమెకు మనం ఓ వ్యక్తిగా అయినా గౌరవమిస్తే బావుంటుందని, ప్రతీ దాన్నీ ట్రోల్ చేయాల్సిన అవసరం లేదని సోషల్ మీడియా ద్వారా పోస్ట్ చేశారు.





## జెనీలియా నేషనల్ ఫుట్ బాల్ ప్లేయర్!

అందాల నటి జెనీలియా టాలీవుడ్ లో ఓ వెలుగు వెలిగిన సంగతి తెలిసిందే. `సత్యం`తో పరిచయమైన అమ్మడు `సాంబ`, `సై`, `నా అల్లుడు`, `హ్యాపీ`, `బొమ్మరిల్లు` లాంటి ఎన్నో సినిమాల్లో నటించింది. నటిగా తనకంటూ ఓ ఇమేజ్ ని క్రియేట్ చేసుకుంది. అప్పటి యువతలో ఓ కలల రాణిగా వెలిగిపోయింది. ఈ సినిమాలన్నింటి కంటే ముందే `బోయ్స్` చిత్రంలో నటించింది. అటుపై బాలీవుడ్ కి వెళ్లిన తర్వాత తెలుగు సినిమాలకు దూరమైంది. రితీష్ దేశ్ ముఖ్ తో వివాహం తర్వాత సినిమాలంటే ఆసక్తి కూడా తగ్గించింది.13 ఏళ్ల తర్వాత ఇటీవలే మళ్లీ `జూనియర్` సినిమాతో కంబ్యాక్ అయిన సంగతి తెలిసిందే. ఇందులో జెనీలియా కీలక పాత్రలో ప్రేక్షకుల్ని అలరించింది. తెరపై కనిపించినంత సేపు సీరియస్ పాత్రలో ఎంగేజ్ చేసింది. కంబ్యాక్ పరంగా జెనీలియాకు మంచి రోల్ పడిందని చెప్పొచ్చు. మరి నటిగా కొనసా గుతుందా? లేదా? అన్నది అమ్మడి చేతుల్లోనే ఉంది. జెనీలియాకు మాత్రం టాలీవుడ్ మంచి అవకాశాలు ఇచ్చే ఛాన్స్ ఉంది. అక్క..వదిన పాత్రలకు జెనీలియా నవతరం హీరోల సినిమాల్లో పర్ఫెక్ట్ సూటవుతుంది. స్టార్ హీరోల చిత్రాలకు పర్ఫెక్ట్ ఛాయిస్ గా చెప్పొచ్చు. కానీ ఛాన్స్ తీసుకోవడమా? లేదా? అన్నది ఆమె చేతుల్లో పనే. ఆ సంగతి పక్కన బెడితే జెనీలియా మంచి పుట్ బాల్ ప్లేయర్ అన్న సంగతి ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ విషయాన్ని తానే స్వయంగా రివీల్ చేసింది. చిన్నప్పటి నుంచి పుట్ బాల్ ఆడే అలవాటు ఉంది. ఆ అలవాటు కేవలం టైంపాస్ గా మాత్రమే కాకుండా సీరియస్ ప్రయత్నాలు చేసి జాతీ య స్థాయిలో పుట్ బాల్ ప్లేయర్ గా ఎదిగిందిట. ఇంటర్మీడియట్ లో పాకెట్ మనీ కోసం మోడలింగ్ లోకి వచ్చిందిట. ఆ తర్వాత నటిగా కెరీర్ అను కోకుం డానే మొదలైందని తెలిపింది. అలాగే జెనీలియా టాలీవుడ్ లో నటించిన మూడవ చిత్రం కూడా స్పోర్ట్స్ బ్యాక్ డ్రాప్ సినిమాతోనే తెరకెక్కింది. నితిన్ హీరోగా నటించిన `సై` చిత్రం లో జెనీలియా హీరోయిన్ గా నటించింది. ఆ సినిమా రగ్బీ ఆట ఆధారంగా రాజమౌళి తెరకెక్కించిన సంగతి తెలిసిందే.